మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL / 25 / A4284

రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 139 | 16 గురువారం, ఏప్రిల్ 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం

# రూ. 25 లక్షల కోట్లు నష్ట పరిహారం చెల్లించాలి

## - రెండోదఫా చర్చల వేళ ఇరాన్ డిమాండ్

**టెహ్రాన్,ఏప్రిల్15నేషనలిస్ట్ వాయిస్**

అమెరికాతో రెండో సారి శాంతి చర్చలు ప్రారంభం కానున్న వేళ ఇరాన్ కీలక డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. ఇటీవల జరిగిన యుద్ధంలో తమ దేశానికి భారీ నష్టం వాటిల్లిందని పేర్కొంటూ, దాదాపు 270 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 25 లక్షల కోట్లు పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. తమకు జరిగిన నష్టాలను భర్తీ చేసేందుకు ఇతర దేశాలు సహాయపడాలని ఇరాన్ కోరుకుంటోంది. యుద్ధం కారణంగా దేశంలోని మౌలిక సదుపాయాలు, గృహాలు, రవాణా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ నష్టాన్ని దేశం ఒంటరిగా భరించడం సాధ్యం కాదని, అంతర్జాతీయ స్థాయిలో పరిహారం అవసరమని ఇరాన్ పేర్కొంది.

# ఏం ఎన్ ఎస్ నాలుగు రాష్ట్రాల జన సంద్రం

- అంబేద్కర్ జయంతి వేళ వైజ్ఞానిక ప్రభంజనం ,
- బ్లాక్ సెల్యూట్ డాక్టర్ బైరి నరేష్ ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాల నుండి వేలాదిగా తరలివచ్చిన బ్లాక్ సోల్జర్స్
- కార్యక్రమంలో ప్రత్యామ్నాయ పద్ధతిలో అక్షరాభ్యాసం, దండల, పెళ్లిళ్లు,ఆటలు,పాటలు

**నేషనలిస్ట్ వాయిస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో ఏప్రిల్ 15**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని, మూఢనమ్మకాల నిర్మూలన సంఘం (ఏం ఎన్ ఎస్ ) ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన'బ్లాక్ సెల్యూట్'కార్యక్రమం అప్రతిహతంగా సాగింది. సంఘం జాతీయ అధ్యక్షులు



డాక్టర్ బైరి నరేష్ జాతీయ సమన్వయకర్త గాండ్ల సుజాత టీచర్ నేతృత్వంలో జరిగిన ఈ భారీ ప్రదర్శనకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, కర్ణాటక,మహారాష్ట్రల నుండి వేలాది మంది కార్యకర్తలు, మహిళలు తరలివచ్చారు.

# మహిళాబిల్లు, పునర్విభజన చట్టం

## -రెంటికీ లింకుపై విపక్షాల ఆందోళన
## -పార్లమెంట్‌లో జరిగే చర్చతో తేలనున్న విషయం

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 15(నేషనలిస్ట్ వాయిస్):**

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం ఎందుకని ప్రభుత్వాన్ని విపక్ష రాజకీయ పార్టీలు నిలదీస్తున్నాయి. ఇందులో కుట్ర కోణం దాగివుందని అంటున్నాయి. నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే దీనిపై అనేక కోణాల్లో విమర్శలు వస్తున్నాయి. దక్షిణాదికి అన్యాయం జరగబోతోందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ రెంటిని కలపడంపైనా మండిపడు తున్నారు. అలాగే ఇదే విషయమై సామాజిక ఉద్యమకారులు ప్రశ్నించారు. కేంద్రం ఎంపీలకు పంపిణీ చేసిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై వివిధ పక్షాలకు చెందిన నాయకులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లులో మొత్తం లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించినప్పటికీ వాటిని రాష్ట్రాల వారీగా ఏ ప్రాతిపాదికన అమలు చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా చెప్పినట్లు ఇప్పుడున్న సీట్లను 50శాతం పెంచితే అన్ని రాష్ట్రాల్లోనూ ఆ వాటా ప్రకారం పెరుగుతాయి. అలాకాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం... అంటే 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గాలను పునర్విభజిస్తే కుటుంబ నియంత్రణ అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని వాదిస్తున్నారు. ఇది ఆందోళనకరంగా కనిపిస్తోందని దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు పలువురు పేర్కొంటున్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే నియోజవర్గాల పునర్విభజన చేయకతప్పదన్న అభిప్రాయాన్ని తప్పుపట్టారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యకు అనుగుణంగానే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చలు జరపాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లు ముసాయిదా ప్రతులను ఇంతవరకు ఎంపీలకు ఇవ్వకపోవడాన్ని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడాన్ని ప్రశ్నించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న సీట్లను 543 నుంచి 850 వరకు పెంచాల్సిన అవసరం ఏముందని నిలదీస్తున్నారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచితే అది ప్రపంచంలోనే అతి భారీ చట్ట సభ అవుతుందని అన్నారు. అది సభాకార్యకలాపాల నిర్వహణపై ప్రభావం చూపుతుందని తెలిపారు. గతంలో సభ ఏడాదిలో 150 రోజుల పాటు సభ జరిగేదని ఇప్పుడు 55 రోజులపాటు కూడా జరగడం లేదని గుర్తు చేశారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉప కోటా లేకపోవడాన్ని కొందరు ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లలో కూడా రిజర్వేషన్ల గురించి అప్పుడే చర్చ మొదలయ్యింది. మొత్తంగా ఈ విషయంలో పార్లమెంటులో చర్చ జరిగితే తప్ప సరైన సమాధానం రాదు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే పునర్విభజన పక్కన పెట్టాలని అంటున్నారు.

# పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

## ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత


**వికారాబాద్,ఏప్రిల్15నేషనలిస్ట్ వాయిస్**

వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు. భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తా మన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.



# పాటలు తప్ప స్కామ్‌లు తెలియవు మీడియా ముందు మంగ్లీ ఆవేదన

**హైదరాబాద్,ఏప్రిల్15నేషనలిస్ట్ వాయిస్**



తనపై వస్తున్న ఆరోపణల కారణంగా చాలా నగిలిపోతున్నానని, తనకు పాటలు తప్ప.. స్కామ్‌లు తెలియవని సింగర్ మంగ్లీ అన్నారు. విచారణ చేసుకోవాలని.. తాను తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా రెడీగా ఉన్నానని చెప్పారు. బుధవారం మంగ్లీ మీడియాతో మాట్లాడుతూ.. 'పేదరికం నుంచి వచ్చాను. డబ్బు విలువ నాకు తెలుసు. నెల రోజులుగా నా ప్రోగ్రామ్‌లు, రికార్డింగ్స్ వదులుకున్నా. ప్రజల్లోకి తప్పుగా వెళ్తోంది. బాధితులకు నేను అండగా ఉంటా. మధు నాయక్, హిమాకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావుపై డీజీపీకి ఫిర్యాదు చేశాను' అని అన్నారు. మంగ్లీ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. 'నేరగాళ్లే బాధితుల రూపంలో పోలీస్ స్టేషన్‌కి వస్తున్నారు. అసలు స్కామ్ చేసిన వాళ్లే మీడియా ముందుకు వచ్చి బాధితులుగా మాట్లాడుతున్నారు.



# కులగణన లేకుండా బిల్లు అమలు కుదరదు

- మహిళా రిజర్వేషన్ బిల్లుపై అభ్యంతరం
- బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమే
- విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్15నేషనలిస్ట్ వాయిస్**

మహిళా రిజర్వేషన్లపై కేంద్రం తీరును రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న సవరణ కేవలం అధికారం కోసమేనని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతు ఇస్తుందని తేల్చి చెప్పారు. గురువారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కులగణన లేకుండా మహిళా రిజర్వేషన్ల అమలులో పారదర్శకత ఉండదని అభిప్రాయపడ్డారు. చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కుట్ర జరుగుతోందన్నారు. కుల గణన డేటాను విస్మరించడం అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమేనని అన్నారు.

# మహిళాబిల్లు, పునర్విభజన చట్టం

## రెంటికీ లింకుపై విపక్షాల ఆందోళన
## పార్లమెంట్‌లో జరిగే చర్చతో తేలనున్న విషయం

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 15నేషనలిస్ట్ వాయిస్**

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం ఎందుకని ప్రభుత్వాన్ని విపక్ష రాజకీయ పార్టీలు నిలదీస్తున్నాయి. ఇందులో కుట్ర కోణం దాగివుందని అంటున్నాయి. నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే దీనిపై అనేక కోణాల్లో విమర్శలు వస్తున్నాయి. దక్షిణాదికి అన్యాయం జరగబోతోందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు ఆరోపిస్తున్నారు.

మిగతా 12లో



# మహిళా బిల్లుకు ఓకే

## డీలిమిటేషన్ బిల్లుకు నో
## వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే

**న్యూఢిల్లీ,ఏప్రిల్15నేషనలిస్ట్ వాయిస్**



పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది.

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

- యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం
- మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మం
- రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం
- లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు
- మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష




**హైదరాబాద్,ఏప్రిల్15నేషనలిస్ట్ వాయిస్**

తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

# గోదావరి జలాల వినియోగంపై యాక్షన్ ప్లాన్

- రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళికలు
- సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షలో చంద్రబాబు ఆదేశం



**అమరావతి,ఏప్రిల్15నేషనలిస్ట్ వాయిస్**

పోలవరం ప్రాజెక్టు పూర్తి కాగానే గోదావరి జలాలను కుడి, ఎడమ కాల్వల ద్వారా తరలించి.. వాటిని ఏయే అవసరాలకు, ఎంత మేర వినియోగించుకోవాలనే దానిపై ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ కాల్వలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జూన్ చివరి కల్లా వెలిగొండ స్టేజ్-1 పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఈమేరకు సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు పనులతో పాటు వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం- నల్లమల సాగర్ లింక్, చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపూడిశిల, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనుల గురించి అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

# కరీంనగర్ జాగృతిలోకి పలువురు నాయకులు జాగృతిలోకి చేరిక

- తెలంగాణ సమూల అభివృద్ధే జాగృతి లక్ష్యం.

- జాగృతి ద్వారా కొత్తతరం రాజకీయాలు చూస్తారు.

- రాష్ట్ర నలుమూలల నుండి పార్టీ ఆవిర్భావ సభకు జాగృతి నాయకులు కదలిరావాలి. - కల్వకుంట్ల కవిత జాగృతి అధ్యక్షురాలు.

**కరీంనగర్ నేషనలిస్ట్ వాయిస్**

జాగృతి కేంద్ర కార్యాలయంలో అధ్యక్షురాలు కవితక్క సమక్షంలో కేంద్ర కార్యాలయంలో ఎర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆద్వర్యంలో మండలానికి చెందిన"హ=ృూ మాజీ జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండమీద అంజయ్య,"హాృూ హుజురాబాద్ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ జంపాల రితిష్,"హ=ృూ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు అంబల హరిష్, అదేవిధంగా గంగాధర మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మీడియా సెల్ ఇంచార్జ్ మ్యాక వినోద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర మోహన్, సుంకపాక రమేష్, గంగాధర మనోజ్, సుంకపాక కిరణ్ తదితరులు కవితక్క నాయకత్వం పట్ల విశ్వాసంతో జాగృతిలో చేరినారు. వారికి కవిత కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ భవిష్యత్ ను మార్చే నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావానికి ఈనెల ఇరవై ఐదోవ తేదీన మేడ్చల్ జిల్లా మునిరాబాద్ వేదిక అవుతుందని కవితక్క అన్నారు. అరోజు తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం జాగృతి పనిచేస్తుందని ఇప్పటికే యాబై కమిటీలు వేసి వాటి ద్వారా తెలంగాణ ప్రజలకు ఎదుర్కుంటున్న చాలా సమస్యలకు శాశ్వతమైన పరిష్కారానికి తెలంగాణ జాగృతి కృషి చేస్తుందని స్వతంత్రం వచ్చి మనకు ఎడు దశాబ్దాల దాటినకూడ ప్రజలు ఇప్పటికీ అభివృద్ధి దూరంగా ఎందుకు ఉన్నారో మనల్ని ఇప్పటి వరకు పాలించిన పార్టీలు సమాధానం చెప్పాలని వారు అన్నారు.ఈ సందర్భంగా జాగృతి జిల్లా నాయకులు యండి సల్మ రూపొందించిన పార్టీ ఆవిర్భావ వాల్ పోస్టర్ ను జాగృతి కవితక్క చేతులు మీదుగా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా నాయకులు బుడిగె పర్శారం గౌడ్, యండి సల్మ, పోన్నం రమేష్, లింగారెడ్డి, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నందిగామ నియోజకవర్గంలో పర్యటించిన మద్దిశెట్టి ప్రజా సమస్యలపై చర్చ

**ఖమ్మం బ్యూరో నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 15**

ఎన్సీపీ పార్టీ ఎన్డీఏ మహాకూటమి ఎన్వైసీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ & ఒడిశా రాష్ట్రాల ఇన్‌చార్జ్ అయిన మద్దిశెట్టి సామేలు ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల మండలం పరిటాల గ్రామాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా నందిగామ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఈరోజు ఉదయం పర్యటించి, అక్కడి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు.రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్సీపీ పార్టీ ఎన్డీఏ మహాకూటమి ఎన్వైసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలను పార్టీ వైపు ఆకర్షించే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మద్దిశెట్టి తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా మహిళా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పటాన్ మున్ని మరియు షేక్ సైదాబీ ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రాం జరిగింది ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు పుట్టబంతి హరిబాబు, ఈదుల రవి, భాను, ధరావత్ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా సెల్ ఎన్సీపీ పార్టీ ఎన్డీఏ మహాకూటమి ఎన్ వై సి



## పిసిపిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

డయాగ్నోస్టిక్ సెంటర్లను తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రవణ్

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం: నిర్వాహకులకు హెచ్చరిక

**హుజురాబాద్/జమ్మికుంట, ఏప్రిల్ 15 నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి**


హుజురాబాద్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రవణ్ గారు ఈరోజు జమ్మికుంట పట్టణంలోని మెగా డయాగ్నోస్టిక్ సెంటర్ మరియు లోటస్ డయాగ్నోస్టిక్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్లలోని రికార్డులను, స్కానింగ్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

**నిబంధనలు పాటించాల్సిందే:**

తనిఖీలో భాగంగా డాక్టర్ శ్రవణ్ గారు మాట్లాడుతూ, గర్భధారణకు ముందు మరియు ప్రసవపూర్వ నిర్ధారణ పద్ధతుల (లింగ ఎంపిక నిషేధం) చట్టం 1994 (పిసిపిఎన్‌డిటి) ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రతి కేసు వివరాలను ఫారం-ఎఫ్ లో తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో లోపాలున్నా లేదా సమాచారాన్ని దాచినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

**లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం:**

ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తేలితే వారి సెంటర్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. డయాగ్నోస్టిక్ సెంటర్లకు వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, వారిని ఎటువంటి ఇబ్బందులకు గురిచేయకూడదని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే కేంద్రాలను నిర్వహించాలని, అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రవణ్‌తో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, సూపర్వైజర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# యువత ప్రాణాలు అమూల్యం.. రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

### శాతవాహన యూనివర్సిటీలో 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సు

**కరీంనగర్, నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 15**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక శాతవాహన యూనివర్సిటీలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ, మున్సిపల్, మరియు రవాణా శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల 3వ రోజు కార్యక్రమానికి జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**అవగాహనతోనే ప్రమాదాల నివారణ: సిపి గౌస్ ఆలం**

ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, ఈ నెల 13 నుండి 18 వరకు కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని, దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ లి'డిఫెన్సివ్ డ్రైవింగ్'లి అలవాటు చేసుకోవాలని సూచించారు. మానవ తప్పిదాలే కారణం: హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అపసవ్య మార్గాల్లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. గణాంకాలు: జిల్లాలో గతేడాది 200 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, అందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువ. పోలీసుల కఠిన చర్యల వల్ల ప్రమాదాల రేటు 17 శాతం తగ్గింది. ప్రభుత్వ ప్రోత్సాహం:ఈ పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ. 1.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంది. హిట్ అండ్ రన్ బాధితులకు కూడా ఆర్థిక సాయం అందుతుంది.రహ వీర్ పథకం:లి లి ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల బహుమతి అందజేస్తుంది.అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు మరియు ర్యాగింగ్ నిరోధక చట్టాలపై సిపి అవగాహన కల్పించారు.

**డ్రగ్ ఫ్రీ యూనివర్సిటీగా శాతవాహన: వీసీ ఉమేష్ కుమార్**

యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, తమ విద్యాలయ ప్రాంగణం డ్రగ్ ఫ్రీగా ఉందని, ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక కమిటీ పనిచేస్తోందని తెలిపారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు క్యాంపస్ అంతటా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు





చేసినట్లు పేర్కొన్నారు.

**ప్రతిజ్ఞ మరియు హెల్మెట్ల పంపిణీ:**

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు విద్యార్థులకు యూనివర్సిటీ వీసీ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి స్టేషన్ అధికారి (ట్రైనీ ఐపీఎస్) సోహం సునీల్, ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్ పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# సాయిరాం హాస్పిటల్లో వైద్య రంగంలో కీలక విజయం

### ప్రమాదకరమైన పారా క్వాట్ విష ప్రభావం నుంచి యువకుడి ప్రాణాలను కాపాడిన మల్టీ స్పెషాలిటీ వైద్య బృందం

**ఖమ్మం బ్యూరో నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 15**

అత్యంత ప్రమాదకరమైన పారా క్వాట్ అనే విషపదార్థాన్ని సేవించిన ఒక రోగిని, వేగవంతమైన చికిత్స మరియు వైద్య నిపుణుల సమన్వయంతో సాయిరాం హాస్పిటల్స్ వైద్య బృందం విజయవంతంగా కాపాడింది. పారా క్వాట్కు ప్రత్యేకమైన ప్రతివిషం లేకపోవడం మరియు దీని మరణ శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఇది అత్యంత క్లిష్టమైన కేసుగా పరిగణించబడుతుంది.రోగి తీవ్రమైన మెటబాలిక్ సమస్యలు మరియు లాక్టిక్ అసిడోసిస్లో ఆసుపత్రికి చేరాడు. పారా క్వాట్ విష ప్రభావం వల్ల సాధారణంగా అనేక అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉండటంతో, వైద్య బృందం "గోల్డెన్ అవర్" లోనే అత్యవసర చర్యలు చేపట్టింది.జీవితాన్ని కాపాడేందుకు బహుళ దశల పోరాటం.ఈ విజయానికి ప్రధాన కారణం వివిధ విభాగాల వైద్యుల సమన్వయం:డా. విజయేష్ వర్మ (నెఫ్రాలజిస్ట్): రోగికి వచ్చిన ఆక్యూట్ కిడ్నీ గాయం ను సమర్థవంతంగా నియంత్రిస్తూ, మొదటి 3-4 గంటల్లోనే హీమోపర్ఫ్యూషన్ ప్రారంభించారు. ఈ ప్రక్రియ ద్వారా రక్తంలోని విషపదార్థాన్ని తొలగించడం అత్యంత కీలకంగా మారింది. డా. నాగార్జున & క్రిటికల్ కేర్ టీమ్:ఐసీయూలో 24 గంటల పర్యవేక్షణతో, రోగి శ్వాసక్రియ మరియు ఇమ్యూన్ సిస్టమ్ను నిరంతరం పరిశీలించారు.లి డా. సునీల్ కుమార్ జంగాల (మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్): గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ట్రాక్ట ఏర్పడిన తీవ్రమైన గాయాలను చికిత్స చేసి, ఎన్ జె (నాసోజీజునల్) ఫీడింగ్ ద్వారా రోగికి అవసరమైన పోషకాహారం అందించారు.డా. ప్రియాంక పెద్దిరెడ్డి (జనరల్ ఫిజీషియన్):రోగి శరీరం మొత్తం పరిస్థితిని స్థిరంగా ఉంచుతూ, 5వ రోజున వచ్చిన అక్యూట్ లివర్ (ఆకస్మిక లీవర్) సమస్యను విజయవంతంగా నియంత్రించారు. అలాగే, ఊపిరితిత్తుల్లో ప్రారంభమైన కెమికల్ న్యుమోనియా (విషపదార్థాల వల్ల వచ్చిన ఇన్ఫెక్షన్)ను కూడా సమయానికి గుర్తించి సరైన చికిత్స ఇచ్చారు.రికవరీ దిశగా ప్రయాణంచికిత్స సమయంలో రోగికి పారా క్వాట్ కారణంగా ఊపిరితిత్తుల సమస్యలు (అల్వియోలైటిస్) మరియు కాలేయ సంబంధిత సమస్యలు ఎదురయ్యాయి. అయినప్పటికీ, వేగవంతమైన నిర్ణయాలు, సమయోచిత చికిత్స మరియు 24/7 పర్యవేక్షణతో రోగి స్థిరంగా కోలుకున్నారు.దాదాపు రెండు వారాలపాటు జరిగిన ఈ తీవ్ర పోరాటం అనంతరం, రోగి ఇప్పుడు పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ సిద్ధంగా ఉన్నారు.

**నిర్వాహకుల ప్రశంస**

డా. స్వాతి జంగాల, చైర్మన్, సాయిరాం హాస్పిటల్స్, వైద్య బృందాన్ని ప్రశంసిస్తూ ఇలా అన్నారు: "పారా క్వాట్ విషప్రయోగం కేసులు అత్యంత క్లిష్టమైనవి మరియు సాధారణంగా





ఫలితాలు అనుకూలంగా ఉండవు. ఈ విజయానికి ప్రధాన కారణం మల్టీడిసిప్లినరీ టీమ్ సమన్వయం. డా. సునీల్ కుమార్ జంగాల, డా. ప్రియాంక పెద్దిరెడ్డి, డా. విజయేష్ వర్మ, డా. నాగార్జునకు నా హృదయపూర్వక అభినందనలు. గోల్డెన్ అవర్లో చేసిన సమయోచిత చర్యల వల్లఏటి ఆర్టి ఓ సాధ్యమైంది.హెచ్ ఓ సాయిరాం హాస్పిటల్స్ అత్యాధునిక వైద్య సేవలు మరియు ప్రాణాలను కాపాడే అత్యవసం చికేత లో ముందంజలో కొనసాగుతోంది.

**81 86 86 13 56 81 21 53 03 33 సాయి రామ్**

**హాస్పిటల్ బిజిడ్ డిజిటల్, నెహ్రూ నగర్ రేవతి సెంటర్.**

## చింతగూడ నూతన గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక

**జన్నారం 15 ఏప్రిల్ (నేషనలిస్ట్ వాయిస్)**

మంచిర్యాల జిల్లా పరిధిలోని జన్నారం మండలం లో బుధవారంనూతన గ్రామాభివృద్ధి కమిటీని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు రు. ఈ కార్యవర్గానికి గౌరవ అధ్యక్షులుగా సుతారి వినయ్ కుమార్ అధ్యక్షులుగా లాకవత్ సుధాకర్ నాయక్, ఉపాధ్యక్షులు గాలిపెల్లి వినీల్, కోశాధికారిగా అరె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిలు నాగుల రాజన్న లో ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి గ్రామస్తులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి సన్మానించారు.



## జిల్లా కలెక్టర్ ను కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే

**బయ్యారం, నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 15.**

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ని వారి కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ తో మాట్లాడుతూ గార్ల బయ్యారం మండలాలకు సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు,పెండింగ్ వర్క్ లకు సంబందించిన అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు.రబిలో పండించిన మొక్కజొన్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, సంబంధిత అధికారులు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ ని ఎమ్మెల్యే కనకయ్య కోరారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ తదితరులు ఉన్నారు.



# విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలి

## -అవగాహనతోనే ప్రమాదాల నివారణ-జిల్లా కలెక్టర్ అంకిత్





భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 15(నేషనలిస్ట్ వాయిస్):

విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్--అ లైవ్" కార్యక్రమం సందర్భంగా బుధవారం పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. "రహదారుల భద్రత మన అందరి బాధ్యత" అనే నినాదంతో ప్రారంభమైన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రహదారుల భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించడం అత్యంత కీలకమని అన్నారు. చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు రహదారి భద్రతపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు బంధువులు ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలనే విషయాన్ని గుర్తు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జీబ్రా క్రాసింగ్ వినియోగం రోడ్డు నియమాల పాటింపు వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతపై పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేక అవగాహనా తరగతులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాలు పట్టణాల్లో ర్యాలీలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. "అరైవ్--అ లైవ్" కార్యక్రమం ద్వారా ప్రజల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ మధురవాణి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, కోఆర్డినేటర్ నాగశేఖరా శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాత్వికను సన్మానించిన డివిజన్ ప్రజలు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 15(నేషనలిస్ట్ వాయిస్):

గురుకుల కళాశాలలో బైపిసి చదువుతున్న సాత్విక ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాలలో 991మార్కులు సాధించింది. అత్యధిక మార్కులు సాధించిన సాత్విక 58వ డివిజన్ లోని హనుమాన్ బస్తీకి రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకొచ్చిన సందర్భంగా ఆమెను హనుమాన్ బస్తిలోని కమ్యూనిటీ హాల్లో ఘనంగా సన్మానించారు. సాత్విక కృషిని తల్లిదండ్రులైన సంతోష్ బాబు రేణుకల ప్రోత్సాహంను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ దావూద్, మాజీ కౌన్సిలర్ లు అంబులవేణు, వాస భారతి, బస్తీ పెద్దలు ఎండ సీతారాములు, పద్మ, రాజన్న , ఉపాధ్యాయుడు అమ్మ మహేష్, చింతల కనకయ్య, నగేష్, గట్టు వేణు, మహమ్మద్ నదీమ్, మొహమ్మద్ అజీమ్ పాషా, వెంకట్ స్థానికులు యువకులు పాల్గొన్నారు.




# మల్కాపూర్ లో మేడికుంట పునరుద్ధరణ పనుల ప్రారంభం

తూప్రాన్, ఏప్రిల్,15. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో వాసన్ స్వచ్ఛంద సంస్థ టీసిపిఎల్ సౌజన్యంతో మేడికుంట పునరుద్ధరణ పనులను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మేడికుంట కట్ట మరమ్మతులు చేయడం మరియు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం వల్ల చుట్టుపక్కల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఈ పునరుద్ధరణ పనులు సాగు నీటి అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ ఆర్గనైజర్లు వినయ్, బసవరాజ్, గ్రామ పాలకవర్గ సభ్యులు జిన్న కృష్ణ, సరిత పరమేష్ గౌడ్, రేఖ నాగరాజు గౌడ్, అలాగే గ్రామ రైతులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

## -గడువులోపు పూర్తి చేయాలని ఆదేశాలు-ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత వేగంపై ప్రత్యేక దృష్టి

## జిల్లా కలెక్టర్ అంకిత్





భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 15(నేషనలిస్ట్ వాయిస్):

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేరకే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని గడువులోపు నిర్మాణ పనులను పూర్తి చేయాలని నాణ్యత ప్రమాణాలు వేగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సుజాతనగర్ మండలం మర్రి తండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 99 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా అందులో 65 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి నిర్మాణ నాణ్యత పనుల పురోగతిని సవివరంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు జరిగిన వ్యయం ప్రభుత్వం నుండి విడుదలైన నిధులు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. లేబర్ చార్జీలు ఎంత అవుతున్నాయి అదనంగా లబ్ధిదారులు ఎంత మొత్తం వెచ్చిస్తున్నారు వంటి అంశాలపై ప్రశ్నించి సమగ్ర సమాచారం సేకరించారు. ఈ క్రమంలో మూడ్ మౌనిక, హాథిరాం, భూక్య అమల, భూక్య సునీత, భూక్య పంతులీ తదితర లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో సుమారు 650 మంది జనాభా ఉండగా వారిలో అధిక సంఖ్యలో తాపీ మేస్త్రీలు ఉన్నారని కలెక్టర్ గమనించారు. ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సహాయానికి అదనంగా లబ్ధిదారులు స్వంతంగా పెట్టుబడి పెట్టి తామే స్వయంగా ఇళ్ల నిర్మాణంలో పాల్గొనడం ద్వారా లేబర్ ఖర్చులను తగ్గించుకుంటూ ఇళ్లను నిర్మించుకుంటున్న విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు నిబంధనల ప్రకారం జరుగుతోందో లేదో అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఇళ్ల విస్తీర్ణం నిర్మాణ పరిమాణాన్ని అధికారులతో టేప్‌తో కొలిపించి నిర్ధారించారు. ఎలాంటి నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, గృహ నిర్మాణ శాఖ ఏఈ లాల్ సాబ్, పంచాయతీ సెక్రటరీ విజయలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు...

నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని గోనుగోప్పుల గ్రామంలో అన్ని అధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదల్చిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి అనువైన పరిస్థితులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు తరగతి గదులతో పాటు, ల్యాబ్ రూమ్ లు, లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ఆర్,ఓ ప్లాంట్, బోర్ వెల్ తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ మరియు జిల్లా అధికారులు మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాలికలు స్వయం సమృద్ధి సాధించాలి

## ఎస్ఐ సుహాసిని

ఏప్రిల్ 15 నేషనలిస్ట్ వాయిస్ ఏర్గట్ల,

విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు మరియు వారికి ప్రేరణ కల్పించేందుకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 'రోల్ మోడల్‌తో విద్యార్థినుల ముఖాముఖి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెండోరా ఎస్సై జాదవ్ సుహాసిని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదవడం గర్వకారణమని, క్రమశిక్షణతో కష్టపడితే ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలను సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించానని, అదే తన విజయానికి పునాదిగా నిలిచిందని గుర్తుచేశారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఆర్థిక స్వావలంబన లేకపోవడమే ప్రధాన కారణమని ఆమె అన్నారు. బాలికలు చదువుతో పాటు కనీసం ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుని స్వయం సమర్థులుగా మారితే, మహిళలపై వేధింపులు గణనీయంగా తగ్గుతాయని సూచించారు. బలమైన సంకల్పం, పట్టుదల ఉంటే విజయం తప్పక సాధ్యమని విద్యార్థినులకు ఆమె సందేశం ఇచ్చారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని, అది సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని అన్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని పి. జ్యోతి తన జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లను వివరించగా భావోద్వేగానికి గురయ్యారు. ఎన్నో కష్టాలను అధిగమించి ఈ స్థాయికి చేరుకున్నానని, విద్యార్థులు కూడా పట్టుదలతో ముందుకు సాగాలని ఆమె ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, సమిత, ఎస్. శ్రీనివాస్, విజయ్, రాజేందర్, రాజనర్సయ్య, గంగాధర్, కె. శ్రీనివాస్, జ్యోతి, ట్వింకిల్ కుమార్, నరేష్, గంగ మోహన్, కోమలి, రిషిక, కృష్ణవేణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు



# దోంచందలో భారీ అక్రమ ఇసుక నిల్వలు స్వాధీనం

**ఏర్గట్ల ఏప్రిల్ 15 నేషనలిస్ట్ వాయిస్**

దోమచంద్ర గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం సుమారు 6.30 గంటల ప్రాంతంలో మండల గిర్దవర్‌తో కలిసి అక్రమ ఇసుక రవాణా అరికట్టే చర్యల్లో భాగంగా వాగు వైపు వెళ్తుండగా, రోడ్డు పక్కన భారీగా నిల్వ ఉంచిన ఇసుకను గుర్తించినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. సుమారు 200 ట్రాక్టర్ ట్రిప్పుల మేర అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను వెంటనే సీజ్ చేసి, ఈ విషయంపై పై అధికారులకు నివేదిక సమర్పించినట్లు ఆయన వెల్లడించారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు కొనసాగిస్తామని తహసీల్దార్ మల్లయ్య హెచ్చరించారు.



# భూమి డాక్యుమెంట్లు గల్లంతు....

**దోమ, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి, ఏప్రిల్,15**




వికారాబాద్ జిల్లా దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ (తండ్రి: సర్వర్) గారి భూమికి సంబంధించిన ముఖ్యమైన డాక్యుమెంట్లు గల్లంతయ్యాయి. పరిగి నుంచి దాదాపూర్‌కు వెళ్లే మార్గంలో ఈ డాక్యుమెంట్లు పోయినట్లు బాధితుడు తెలిపారు. గల్లంతైన డాక్యుమెంట్ నంబర్ 773/2025 కాగా, జిపిఏ పత్రాలు కావడం విశేషం. ఎవరికైనా ఈ డాక్యుమెంట్లు దొరికినచో తిరిగి అందజేయాలని బాధితుడు కోరారు. అందజేసిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడుతుందని తెలిపారు. డాక్యుమెంట్లు దొరికిన వారు ఈ కింది నంబర్లకు సంప్రదించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. 9502332669, 9908908606

# పరిగిలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం...

**దోమ, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి, ఏప్రిల్,15**

మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించేందుకు పరిగిలోని బాలికల పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, పరిగి డిఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమం జరిగింది. పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జ్ నర్సిములు సమక్షంలో విద్యార్థినులకు పలు అంశాలపై వివరించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్ 100, షీ టీం హెల్ప్‌లైన్ 181, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా నియంత్రణ, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ మరియు ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, సైబర్ నేరాలు (హెల్ప్‌లైన్ 1930) వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, షీ టీం సభ్యులు బి. సావిత్రి, శోభ పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో భద్రతా చర్యలపై చైతన్యం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.






# బంట్వారం పోలీస్ స్టేషన్‌లో జాగృతి అధ్యక్షురాలు కవిత

**వికారాబాద్, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి, ఏప్రిల్,15**




పరిగి రైతులకు మద్దతుగా వచ్చిన నిజామాబాద్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వికారాబాద్‌లో అదుపులోకి తీసుకున్న అనంతరం ఆమెను ముందుగా దారూర్ పోలీస్ స్టేషన్‌కు, తరువాత బంట్వారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కవితకు మద్దతుగా రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని నిరసనలు చేపట్టారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి

-అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ-రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతలా భావించాలి-ఎస్పీ రోహిత్ రాజు-పేట పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 15(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిం చాలని అశ్వారావు పేట ఎమ్మెల్యే జారే ఆది నారాయణ అన్నారు. అశ్వారావు పేటలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందిం చేందుకు "అరైవ్ ఎలైవ్" కార్యక్రమం బుధవారం నిర్వ హించారు. పట్టణం లోని శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్య క్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మున్సిపల్ పాలక మండలి సభ్యులు, అధి కారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగు తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చి తంగా పాటించడం అత్యవ సరమని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని హెచ్చరిం చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ "అరైవ్ ఎలైవ్" కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడం అని తెలిపారు. ముఖ్యంగా యువతలో ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన పెంపొం దించడం ద్వారా ప్రమా దాలను తగ్గించవచ్చని అన్నారు. చిన్న చిన్న నిర్లక్ష్యాలు కూడా పెద్ద ప్రమా దాలకు దారితీస్తాయని హెచ్చరిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో భాగంగా కళాకారులచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందిం చేందుకు పాఠశాల స్థాయిలో వక్తృత్వ పోటీలు నిర్వ హించగా అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే జారే ఆది నారాయణ, ఎస్పీ రోహిత్ రాజు, మున్సిపల్ చైర్మన్ శశికళ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం రోడ్లపై హెల్మెట్ లేకుండా ప్రయా ణిస్తున్న ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్లు పంపిణీ చేసి వాటి ప్రాముఖ్యతను వివ రించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజలు



కలిసి రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, ఎస్సై యాయాతి రాజు, అదనపు ఎస్ఐ అఖిల, ఎంపీడీవో అప్పారావు, మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు,

# తూప్రాన్‌లో రోడ్డు భద్రతపై భారీ మానవహారం

ప్రజా పాలన -- పట్టణ ప్రగతి కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ ముఖ్య అతిథిగా హాజరైన ఐజీపి చంద్రశేఖర్ రెడ్డి

**తూప్రాన్, ఏప్రిల్ 15. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందిం చేందుకు ప్రజా పాలన -- పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఘనంగా మానవహారం (హ్యూమన్ చైన్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, పోలీసులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతను చాటి చెప్పారు.

రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ -- 4వ దశ (3వ రోజు) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గీతా స్కూల్ విద్యార్థులు ముందుండి మానవహారం ఏర్పాటు చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐజీపీ శ్రీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతు న్నాయని, బాధిత కుటుంబాలు జీవితాంతం కోలుకోలేని ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, వాహనానికి సంబంధిత పత్రాలు, ఇన్సూరెన్స్ సక్రమంగా ఉండాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రతిమా సింగ్, ౱ూూ గారు మాట్లాడుతూ చిన్నారుల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస్ రావు, ఋూ గారు రోడ్డు నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. మొత్తంగా ఈ మానవహారం కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ, ట్రాఫిక్ నియమాల పాటనకు ప్రాధాన్యతను చాటి చెప్పినట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచంద్ర రెడ్డి, డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ శ్రీ రంగాకృష్ణ గౌడ్, సీఐలు జానారెడ్డి, వెంకట్రాజ్ గౌడ్, తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ గంగరాజు, జ్యోతి, యాదగిరి, వాణి లు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని




రవీందర్ గౌడ్, వైస్ చైర్‌పర్సన్ కొక్కొండ సమతా రెడ్డి, కౌన్సిలర్లు మరియు గీతా స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పడాలపల్లిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన



**తూప్రాన్, పడాలపల్లి, ఏప్రిల్ 15. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

పడాలపల్లి 11వ వార్డులో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతి ష్ఠాపనకు శంకుస్థాపన కార్యక్రమం భారీగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించ బడింది. స్థానిక ప్రజలు, యువత పెద్దఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొల్లెం సత్యనారాయణ ఆధ్వర్యంలో లంబ పోచయ్య, పంబాల సత్తయ్య, వర్గంటి రామ్ మోహన్, లంబ సాయిబాబు, లంబ రాజు, కుమ్మరి ఎగొండ, లంబ ఐలేశ్వర్, గండి మల్లేష్, రాపోల్ రాజు, మట్టెల శ్రీను, వెంగళి వెంకటేశ్, లంబ పోలురాజు, నడిపల్లి వెంకటేష్, గండి రాములు, బూడిద స్వామి, లంబ మల్లిఖార్జున్, వెంగళి ప్రవీణ్, రొయ్యల స్వామి, లంబ ఈశ్వర్, నడిపల్లి రవి, కుమ్మరి భాస్కర్, గండి స్వామి, లంబ లింగం, మట్టెల దేవరాజు, లంబ మహేష్, కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యువత నుంచి మట్టెల నాగరాజు, వెంగళి నవీన్, లంబ సుధాకర్, లంబ శివ, తొంట కిరణ్, లంబ టింకు, లంబ వెంకటేశ్, లంబ మధు, గండి ఆనంద్, బత్తుల ఉదయ్, పిల్లుట్ల రమేష్, రాపోల్ ఎల్లేష్, లంబ ప్రశాంత్, వెంగళి నరేందర్, కీరల ప్రశాంత్, లంబ వంశీ, సందుల ప్రశాంత్, లంబ నరేష్ మరియు శివాజీ యూత్ సభ్యులు పాల్గొని కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ ఆశయాలు, ధైర్యసాహసాలు, హిందూ ధర్మ పరిరక్షణలో ఆయన పాత్రను గుర్తుచేశారు. యువతలో దేశభక్తి, ధర్మబద్ధత పెంపొందించేందుకు ఈ విగ్రహం ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. శంకుస్థాపన అనంతరం, విగ్రహ నిర్మాణాన్ని అతి త్వరలో పూర్తి చేసి ఘనంగా ప్రారంభోత్సవం నిర్వహిం చాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ కార్యక్రమం పడాలపల్లిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉత్సాహాన్ని పెంచిన సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# వైఎస్ జగన్ మాజీ సిపిఆర్‌వో శ్రీహరి అరెస్ట్

## - సిఎంకు వ్యతిరేకంగా తపపుడు పోస్టులు పెట్టడంపై కేసు

## - అరెస్ట్‌ను ధృవీకరించిన వైసిపి నేతలు

**అమరావతి,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

వైఎస్ జగన్ మాజీ సీపీఆర్‌వో పూడి శ్రీహరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో శ్రీహరి తప్పుడు పోస్టులు పెట్టించారనే ఆరోపణలు వచ్చాయి. చంద్రబాబు చేతిలో కత్తిపెట్టి యానిమేషన్ పోస్టింగ్‌లు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందడంతో చిత్తూరు జిల్లాలో కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులోనే బుధవారం శ్రీహరిని తాడేపల్లిలోని నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. ఆయన మొబైల్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పూడి శ్రీహరి సీపీఆర్‌వోగా పనిచేశారు.. ఆయన ప్రస్తుతం వైసిపి మీడియా విభాగం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పార్టీ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు వైసిపి తెలిపింది. ఉదయం తాడేపల్లిలోని శ్రీహరి ఇంటికి వచ్చిన పోలీసులు సోదాలు చేసి.. ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని శ్రీహరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అయితే పూడి శ్రీహరిని చిత్తూరు జిల్లా కుప్పం పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో అరెస్ట్ చేసినట్లు మాజీ మంత్రి అంబటి రాంబాబు ట్వీట్ చేశారు. చిత్తూరు 2 టౌన్ సీఐ పూడి శ్రీహరిని దౌర్జన్యంగా తీసుకెళ్లారని.. ఈ అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నాను అన్నారు. పూడి శ్రీహరి గతంలో పలు మీడియా సంస్థల్లో పనిచేశారు.. అనంతరం 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ పాదయాత్ర చేసిన సమయంలో శ్రీహరి కీలకంగా వ్యవహరించారు. మీడియాకు సంబంధించిన వ్యవహారాల ను శ్రీహరి చక్కదిద్దారు. అలాగే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రపై అడుగడుగునా అంతరంగం పేరుతో ఓ



పుస్తకాన్ని కూడా రాశారు. 2019 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆయనకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సీపీఆర్‌వోగా కీలక బాధ్యతలు అప్పగించారు. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత శ్రీహరికి వైసిపి మీడియా విభాగం బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం శ్రీహరి మీడియా విభాగం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్నారు.

# పరిగిలో పోషణ్ పక్వాడ కార్యక్రమం

**పరిగి, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి, ఏప్రిల్,15**

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పరిగి పట్టణంలోని 18వ వార్డు అంగన్వాడి కేంద్రంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి టీచర్ కట్టా వెంకటమ్మ, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల మొదటి ఆరేళ్లలో సానుకూల మార్పులు తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గర్భధారణ నుంచి రెండేళ్ల వరకు ఉండే తొలి 1000 రోజులు శిశువుల శారీరక, మానసిక అభివృద్ధికి కీలకమని చెప్పారు. ఈ దశలో సరైన పోషకాహారం, తగిన సంరక్షణ అందించడం ఎంతో అవసరమని సూచించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందిందని నిర్వాహకులు తెలిపారు.



# రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

## - యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే

## - డబ్బుల మూటలతో రేవంత్ రాజకీయం- మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు

## - రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం

**న్యూఢిల్లీ,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ కె. లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా?, ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా? అంటూ విపక్షాలకు ఆయన ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డబ్బున్న వాళ్ళకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో150 సీట్లను 300 సీట్లు చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలన్న కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని ఆ పార్టీ నేతలను ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదన చేస్తున్నారని వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు.

# బొంపల్లిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం....

**దోమ, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి, ఏప్రిల్,15**

99 డేస్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బొంపల్లి గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రోడ్డు భద్రత--ప్రమాదాల నివారణ అంశంపై బుధవారం డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మతిన్, కీర్తన, అభిత, ప్రేమ, విష్ణు విజేతలుగా నిలిచారు. పాఠశాల ముందు రహదారిపై జీబ్రా క్రాసింగ్ గీయడంతో పాటు గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. విజేతలకు దోమ మండల ఎంపీడీవో గ్యామా, ఎస్సై వసంత్ జాదవ్, ఎంఈఓ వెంకట్, సర్పంచ్ విజయపవన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షఫీ, గ్రామ కార్యదర్శి మీనా, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# బంగ్లా పౌరుల పడవ మునక

## - 250 మంది గల్లంతు..ముమ్మర గాలింపు

**ఢాకా,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

అండమాన్ తీర సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టెక్నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా.. ఈ పడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

# పేలిన గ్యాస్ సిలిండర్లు నలుగురు మృత్యువాత


**శ్రీ సత్య సాయి,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. గ్యాస్ మంటలు చుట్టు పక్కల వ్యాపించడంతో భారీ ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ÷ర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో గాయపడిన వారిని వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గ్యాస్ మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు భయపడి బయటకు పరుగులు తీశారు.

# పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్ మోహన్ రెడ్డి కుమార్తె శ్రీమతి మేఘ్నా రెడ్డి శ్రీ సంతోష్ రెడ్డి రిసెప్షన్.

**యాలాల్ (నేషనలిస్ట్ వాయిస్)**

పరిగీ ఎం ఎల్ ఏ .టి. రామ్ మోహన్ రెడ్డి కుమార్తె మేఘ్నా రెడ్డి, సంతోష్ రెడ్డి వివాహ విందుకు హాజరయ్యా యాలాల్ మండల కేంద్రానికి చెందిన దేవనూరు గ్రామానికి చెందినది కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎ భీమన్న గారు మాజీ సర్పంచ్ హన్మంతన్న, మాజీ ఏం పి టి సీ మల్లన్న, ఎ ఎం సి మొగులప్ప, ఉపసర్పంచ్ రాఘవేందర్ రెడ్డి , నాగన్న, సత్యనారాయణ , మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు కె శ్రీశైలం, అజమ్, ఎన్ ఎస్,శ్రీనివాస్, రాజు, నరేష్ మరియు తదితరులు పాల్గొన్నారు వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపినారు.





# హనుమాన్ మాల ధరించిన విద్యార్థికి అవమానం

## హెడ్మాస్టర్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

**జయశంకర్ భూపాలపల్లి,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

హనుమాన్ మాలలో వచ్చిన విద్యార్థిని పాఠశాలలోకి అనుమతించకపోవడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి హనుమాన్ దీక్ష తీసుకున్నాడు. దీంతో హనుమాన్ మాల ధరించి పాఠశాలకు వెళ్లాడు. అయితే పాఠశాల హెడ్ మాస్టర్ ఆ విద్యార్థిని గేటు వద్దే అడ్డుకున్నారు. మాల ధరించి తరగతి గదిలోకి రాకూడదని చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. హెడ్ మాస్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులు, బజరంగదళ్ కార్యకర్తలు.. పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో నినాదాలు చేస్తూ భైఠాయించారు.

# తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

## - పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇవాళ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

# వడగాలులు, ఎండలతో జాగ్రత్త

- పిడుగులతో కూడిన వర్షాల సమయంలో ఇంటివద్దనే ఉండాలి..
- తుఫాన్ల వరదల సమయంలో అంటువ్యాదులతో జాగ్రత్త.
- ఇంటి పరిసరాలు అనేవి ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ప్రకృతి విపత్తుల నుండి కాపాడుకోవడానికి సూచనలు తప్పక పాటించాలి.
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్

**విజయవాడ,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

ఎండ తీవ్రతకు, వడగాల్పులకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణహాని నుండి కాపాడుకోవచ్చునని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు. తలనొప్పి, తలతిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండడం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ వంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలని ఆయన చెప్పారు. వడగాల్పుల నుండి రక్షణ కొరకు టోపీ, రుమాలు, తెలుపు రంగు కాటన్ వస్త్రాలను వినియోగించా లన్నారు. కళ్ల రక్షణ నిమిత్తం నాణ్యమైన సన్ గ్లాసెస్ వినియోగించాలన్నారు. ఇంటివాతావరణం చల్లదనం కోసం ఇంటి పై కప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్ వంటి అంశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేడపై మొక్కలు, ఇండోర్ ప్లాంట్స్ భవనాలను చల్లగా ఉంచుతాయని చెప్పారు. మొక్కలు ఉష్ణ తాపాన్ని తగ్గిస్తాయని సూచించారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచడం ద్వారా వేడి గాలుల నుండి ఉపశమనం లభించి చల్లని వాతావరణం అలముకుంటుందని చెప్పారు. వర్షం పడిన సమయంలో పిడుగుపాటుకు గురి కాకుండా తక్షణం జాగ్రత్తలు తీసుకోవాలని అయన సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో ఇంటిలోనే ఉండాలని ఆయన సూచించారు. ఉరుముల సమయంలో సముద్రము, కొలనులు, చెరువుల దగ్గర ఉంటే వెంటనే దూరంగా వెళ్లాలన్నారు. రేకు లోహము కలిగిన నిర్మాణాలకు దూరంగా ఉండాలన్నారు. ఉరుముల శబ్దం వినగానే పొలాల్లో పనిచేసే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలన్నారు. కారు, బస్సు లోపల ఉన్నవారు వెంటనే అన్ని డోర్స్ మూసివేయాలి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఉన్నప్పుడు మెడవెనుక జుట్టు నిక్క బొడవడం లేదా చర్మం జలదరింపు ఉంటె మెరుపు పిడుగు రావడానికి సూచనగా భావించాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉండి సురక్షిత ప్రదేశాలకు వెళ్లే అవకాశం లేకుంటే రబ్బరు చెప్పులు ధరించి చెవులు మూసుకుని తలను నేలకు తగలకుండా మోకాలిపై కూర్చోవాలన్నారు. దీనివల్ల ఉరుములు మెరుపులు నుండి రక్షణ పొందవచ్చునని చెప్పారు. ఉరుముల సమయంలో ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు తలుపులు మూసివేయాలి. ఉరుముల శబ్దం ఆగిపోయిన తర్వాత కూడా 30 నిమిషాల వరకూ ఇంట్లోనే ఉండి రక్షణ పొందాలని సూచించారు. పిడుగు బాధితులను తాక వచ్చునని చెప్పారు. సత్వరమే వారికి సహాయం అందించవచ్చునని చెప్పారు. పిడుగు బాధితుని వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. ఉరుములు మెరుపులు సంభవించినపుడు చెట్ల క్రింద, చెట్ల సమీపంలో, టవర్లు, చెరువుల దగ్గర ఉండరాదన్నారు. ఎలెక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, ఛార్జ్ డ్ ఫోన్స్, మొబైల్ ఫోన్స్ వినియోగించరాదన్నారు. పిడుగులా సమయంలో స్నానం చేయడం, చేతులు కడగడం, నీటిలో ఉండడం లాంటివి చేయరాదన్నారు. మోటారు సైకిళ్ళు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, వ్రేలాడుతున్న విద్యుత్ తీగలకు, విద్యుత్ స్తంభాలకు ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలన్నారు. వాహనంలో ఉండి ఉంటే లోహపు భాగాలను తాకరాదన్నారు. ఎండ తీవ్రత నుండి కాపాడుకోవడానికి గాను వీలైనంత వరకూ ఇంట్లో ఉండాలి. తరుచూ నీటిని త్రాగుతూ ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిపిన నీటిని త్రాగాలి. తరుచూ వాతావరణం సమాచారం తేలుకుంటూ ఉండాలి అందులకు గాను న్యూస్ అనేది వాచ్ చేయాలి. ఎండలో నుండి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు వంటివి తీసుకోవాలి. ఎండలో బయటకు వచ్చినపుడు తలతిరుగుట, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుని సంప్రదించాలన్నారు. ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలి. ఫ్యాన్ వాడాలి. చల్లని నీటితో స్నానం చేయాలి. ఎండలో గొడుగు లేకుండా తిరగరాదు. నలుపురంగు మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. ఎండ సమయంలో శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు. బాలింతలు, వృద్దులు, చిన్నపిల్లలు ఎండ సమయంలో బయట సంచరించరాదు. వీరిపై ఎండ ప్రభావం కనపడే అవకాశం ఉంటుంది. శరీరాన్ని డీ హైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బోనేటేడ్ శీతల పానీయాలు మానుకోవాలి. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలు తీసుకోరాదు. ప్రకాశించే బల్బులను వినియోగించడం మానుకోవాలి. అవి అనవసరపు వేడిని విడుదల చేస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు. తుఫాన్, వరదల సమయంలో టెలివిజన్ రేడియో ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా సమాచారం అందుకున్న వెంటనే ప్రమాద స్థలం వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలి. తుఫాన్ వరదల సమయంలో ముందుగానే విలువైన వస్తువులు, పత్రాలు, నగదుతో సురక్షిత ప్రదేశంలో తలదాచుకోవాలి. సహాయక చర్యల్లో పాల్గొనే అధికారులకు సహకరించాలన్నారు. ప్రభుత్వ సూచనలు అందుకున్న పిమ్మట మాత్రమే ఇళ్లకు తిరిగి వెళ్లాలన్నారు. తుఫాన్ లు వరదల తర్వాత అంటువ్యాదులు నిరోధించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తుఫాన్ లు, వరదల సమయంలో కాల్వలకు వంతెనలకు అడ్డుపడిన చెత్తను తొలిగించాలి. సముద్ర నదీతీర ప్రాంతాలకు వెళ్ళరాదు. చేపల వేటను మానుకోవాలి. నదులు దాటే ప్రయత్నం చేయరాదు. పాడుపడిన ఇళ్ళు చెత్తా చెదారం నుండి దూరంగా ఉండాలి. విద్యుత్ పరికరాలను వినియోగించరాదు. వరద నీటి ద్వారా వచ్చే విష జ్వరాల నుండి జాగ్రత్తలు తీసుకోవాలి. అంటువ్యాదులు వ్యాపించకుండా వరదనీరు కలుషిత నీరు నుండి దూరంగా ఉండాలి. ఇళ్లకు ఉన్న పగుళ్ళను పరిశీలించి తదుపరి లోపలకు వెళ్ళాలి. ఇంట్లో ఉన్న విద్యుత్ ఉపకరణములు ఆఫ్ చేయాలి. తడిచిన విద్యుత్ వస్తువులు తాకరాదు. ప్రకృతి విపత్తులు అయిన ఎండలు, వడగాలులు, తుఫాన్ లు, వరదలు, పిడుగులు, ఉరుములతో కూడిన వర్షాలు సమయంలో అత్యంత జాగరూకత వహించాలని ఆయా సమయాల్లో విపత్తుల నిర్వహణ సంస్థ వారు జారీ చేసిన రక్షణ చర్యలను పాటించాలని అప్పుడు ప్రాణాపాయం నుండి రక్షించుకోవచ్చునని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు.

# జనగణనకు ప్రజలు సహకరించాలి

- ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే క్రిమినల్ చర్యలు
- ఏపీ జనగణన డైరెక్టర్ జె.నివాస్

**అమరావతి,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

ఆంధ్రప్రదేశ్‌లో జనగణనకు ప్రజలు సహకరించాలని ఏపీ జనగణన డైరెక్టర్ జె.నివాస్ కోరారు. జనగణనకు ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్యూమరేటర్లకు అవసరమైన వివరాలు తప్పకుండా అందించి సెన్సస్ పక్రియకు పూర్తి సహకారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి నంబర్ల నమోదు పక్రియకు ఎలాంటి అడ్డంకుటూ కల్పించవద్దని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు సెన్సస్ డేటా ఎంతో కీలకమని జె.నివాస్ పేర్కొన్నారు. ఇది దేశంలో 16వ సెన్సస్ అని, స్వాతంత్యం÷-ర తర్వాత ఎనిమిదవది అని ఆయన వెల్లడించారు. కేంద్ర హోమ్ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఈ పక్రియ జరుగుతోందని జె.నివాస్ తెలిపారు. దీనికి రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ మార్గదర్శకాలు ఇస్తారని, ఏపీ చీఫ్ సెక్రటరీ పర్యవేక్షిస్తారని వివరించారు. రాష్ట్ర నోడల్ ఆఫీసర్‌గా చీఫ్ సెక్రటరీ బాధ్యతలు నిర్వర్తిస్తారని చెప్పుకొచ్చారు జె.నివాస్. ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులుగా జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఉంటారని తెలిపారు. చార్జ్ ఆఫీసర్లుగా తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు డేటా సేకరణ బాధ్యతలు అప్పగిస్తారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని, ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు. పక్రియలో ప్రతి బిల్డింగ్‌కు ప్రత్యేక సెన్సస్ హౌస్ నంబర్ ఇస్తామని.. కాలేజీలు, ఫ్యాక్టరీలు, కమర్షియల్ బిల్డింగ్స్‌కూ నంబర్ కేటాయిస్తారన్నారు. మూడు ప్రధాన గుర్తింపులతో నంబర్ కేటాయింపు ఉంటుందని జె.నివాస్ తెలిపారు. బిల్డింగ్ నంబర్, సెన్సస్ హౌస్ నంబర్, హౌస్‌హోల్డ్‌కు స్థానిక సంస్థల నంబర్ల ఆధారంగా నంబర్ కేటాయి స్తారన్నారు. నంబర్ లేకపోతే ఎన్యూమరేటర్ కొత్తగా నంబర్ ఇస్తారని తెలిపారు. ఇంట్లో నివాసంగా ఉపయోగిస్తున్న భాగాన్నే హౌస్‌హోల్డ్‌గా పరిగణిస్తారని.. కమర్షియల్, నివాసం రెండూ కలిసి ఉంటే వేర్వేరుగా నమోదు చేస్తారని చెప్పారు. ఇంటి పరిస్థి తిపైనా పలు ప్రశ్నలు సంధిస్తారన్నారు. ఇంటి నిర్మాణం, గోడలు, మెటీరియల్ వంటి వివరాలూ సేకరిస్తారని ఏపీ జనగణన డైరెక్టర్ తెలిపారు. భవనాన్ని ఏ విధంగా ఉపయోగిస్తున్నారనే అంశాలనూ నమోదు చేస్తారన్నారు. ఈసారి పూర్తిగా డిజిటల్ సెన్సస్ ఉంటుందని.. ఇదంతా హౌస్‌హోల్డ్ నంబర్ యాప్‌లో ఆటో జనరేషన్ అవుతుందని తెలిపారు.

# గోదావరి జలాల వినియోగంపై యాక్షన్ ప్లాన్

- రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళికలు
- సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షలో చంద్రబాబు ఆదేశం

**అమరావతి,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

పోలవరం ప్రాజెక్టు పూర్తి కాగానే గోదావరి జలాలను కుడి, ఎడమ కాల్వల ద్వారా తరలించి.. వాటిని ఏయే అవసరాలకు, ఎంత మేర వినియోగించుకోవాలనే దానిపై ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ కాల్వలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జూన్ చివరి కల్లా వెలిగొండ స్టేజ్-1 పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఈమేరకు సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు పనులతో పాటు వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం- నల్లమల సాగర్ లింక్, చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపూడిశిల, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనుల గురించి అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో భూగర్భజలాల పెంపు, జలధార, జల హారతి కార్యక్రమాలపైనా సమీక్షించారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార నదిపై నిర్మించ తలపెట్టిన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగడంతో త్వరితగతిన టెండర్లు పిలవాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని.. హోటల్స్, షాపింగ్ ఏరియా ఉండాలని తెలిపారు. ప్రాజెక్టు సమీప ప్రాంతాల సుందరీకరణకు సంబంధించిన డిజైన్లను పరిశీలించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించేలా పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయని అధికారులు వివరించారు. ఏప్రిల్ 1 నాటికి 625 టీఎంసీల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 12 టీఎంసీల నీరు అదనంగా ఉందని తెలిపారు. అదేవిధంగా గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏప్రిల్ నాటికి 0.79 మీటర్ల మేరకు భూగర్భ జలాలు పెరిగాయన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపి ఇంటర్ ఫలితాలు విడుదల

- మొదటి సంవత్సరంలో 77 శాతం
- రెండో సంవత్సరంలో విద్యార్థులు 81 శాతం పాస్
- ఫలితాల్లో అమ్మాయిలదే హవా

**అమరావతి,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం పాస్ అయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్‌తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలనువెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. మెసేజ్‌ను 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్టి కృషి వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 85శాతంగా నమోదయ్యింది. ప్రథమ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 81శాతంగా నమోదు అయ్యింది. రీకౌంటింగ్ / రీవెరిఫికేషన్ దరఖాస్తులలను ఏప్రిల్ 20 నుంచి 27 వరకు వరకు స్వీకరిస్తారు. స్కాన్ కాపీతో రీవెరిఫికేషన్‌కు అవకాశం ఉంది. సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుంచి జూన్ 4 వరకు థియరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకు ప్రాక్టికల్స్ రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ ఉంటుంది. మొదటి సంవత్సరం పాస్ అయిన వారికి ఇంప్రూవ్‌మెంట్‌కు ఛాన్స్ ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పూర్తి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తిరిగి కృషి చేసి విజయం సాధించాలని వారికి పిలుపు ఇచ్చారు. ఈ సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక బలం ఇవ్వాలని, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని విజయాలు సాధించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# గ్యాస్ పేలుడు ఘటనపై మంత్రి సవిత దిగ్భ్రాంతి

- బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- ఘటనపై విచారణకు ఆదేశించిన మంత్రి

**సత్యసాయి,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

కుమ్మరవాండ్లపల్లిలో గ్యాస్ పేలుడు ఘటనపై ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆవేదన కలిగించిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై వెంటనే సమగ్ర దర్యాప్తు నిర్వహించి పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులకు మంత్రి సవిత ఆదేశ్యాలు జారీ చేశారు. ఈ ఘటన వెనుక ఏవైనా అసాంఘిక శక్తుల ప్రమేయం ఉన్నట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గాయపడిన వారికి ఉత్తమ చికిత్స అందిస్తామని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఆస్తి నష్టంపైనా పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు మంత్రి సవిత. ఇళ్లలో పేలుడు పదార్థాలను నిల్వ చేయడం అత్యంత ప్రమాదకరమని, అది చట్టరీత్యా నేరమని ఆమె హెచ్చరించారు. అయితే, డిటోనేటర్లు, అమ్మోనియం సల్ఫేట్ వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. వెంకన్న, సంపత్ కుటుంబం డిటోనేటర్ల సహాయంతో కొండల్లో రాళ్లను పగలకొట్టి అమ్ముకుంటున్నారు. వీటిని ఇంట్లో పెట్టడంతో ప్రమాదం జరిగి ఐదుగురు మృతిచెందారు.

# రామాలయానికి అనుమతులు ఉన్నాయి

- కేసు వేసిన వారి చర్చిలకే అనుమతులు లేవు
- ఆకివీడు రామాలయ నిర్మాణంపై డిప్యూటి స్పీకర్

**భీమవరం,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయం నిర్మించేందుకు కోటి రూపాయలు సమకూరాయని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. నగదు మొత్తం భక్తులే ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. త్వరలో అన్ని అనుమతులతో రామాలయం నిర్మిస్తామని తేల్చి చెప్పారు. ఆకివీడులో రామాలయం ఉందని ముందుగా తనకు సాక్షి మీడియా ద్వారానే తెలిసిందని.. రాముడి కోసం వెళ్తే తనపై దాడి చేయించారని డిప్యూటీ స్పీకర్ ఆరోపించారు. అనుమతి లేకుండా రామాలయం కడుతున్నామని న్యాయవాది జడా శ్రావణ్ సహా మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ వేశారని తెలిపారు. ఈ పిటిషన్‌పై హైకోర్టులో నేడు విచారణ జరిగిందని అన్నారు . ఆలయం, మసీదు, చర్చి నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరని.. పర్మిషన్ లేకుండా రామాలయం కడుతున్నట్లు పిటిషన్ ద్వారా వారు కోర్టుకు చెప్పారన్నారు. అనుమతి లేని చర్చిలపైనా చర్యలు ఉండాలని తానూ చెబుతున్నట్లు రఘురామకృష్ణరాజు తెలిపారు. అయితే, పిటిషన్లు వేసిన వారు నిర్వహిస్తున్న చర్చిలకూ ఎటువంటి అనుమతి లేదని ఆయన ఆరోపించారు. అనుమతులు లేకుండా రామాలయం నిర్మాణం జరగదని కోర్టుకు తాను విన్నవించినట్లు చెప్పుకొచ్చారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులను తాను కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఎంతో చరిత్ర కలిగిన రామాలయం పునర్నిర్మాణానికి అనుమతి ఉండాలని జడా శ్రావణ్ కోర్టులో చెప్పారన్నారు. అదే రూల్ ప్రకారం కల్వరి సతీశ్ ప్రార్థనా మందిరానికి అనుమతి ఉండాలి కదా అని ప్రశ్నించారు. తాడేపల్లిగూడెంలో వారు మీటింగ్ హాలు కడతామని అనుమతి తీసుకుని ఆ తర్వాత చర్చిగా మార్చుకుని ప్రార్థనలు చేస్తున్నట్లు రఘురామ చెప్పారు. ఈ విషయాన్ని అధికారులు గుర్తించి మూడు నెలల కిందటే నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఇంతవరకూ దీనిపై వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదన్నారు. నంబూరు వద్ద ఉన్న కల్వరి టెంపుల్‌కీ అనుమతి లేదని తర్వాత తేలిందన్నారు. అలాంటి నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు నోటీసులు ఇస్తే కోర్టుకు వెళ్లారని.. ఇలా చాలా చోట్ల ప్రార్థనా మందిరాలను వ్యాపార కేంద్రాలుగా చేసుకుంటున్నారని ఆరోపించారు.

# నిజామాబాద్ మార్కెట్లో పసుపు రైతుల దాడి

## - ధరలు తగ్గించి కొనడంపై ఆందోళన

**నిజామాబాద్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

నిజామాబాద్ మార్కెట్ యార్డుపై పసుపు రైతులు దాడికి దిగారు. బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేస్తూ పసుపు ధర తగ్గిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్ లైన్ లో ఒక ధర ఉంటే.. ఆఫ్ లైన్ ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ అధికారుల తీరుపై మండిపడ్డ రైతులు.. ఆఫీస్ పై దాడి చేశారు. మార్కెట్ అధికారులను ఘెరావ్ చేశారు. కుర్చీలు, అద్దాలు ధ్వంసం చేశారు. మార్కెట్ లో బహిరంగవేలం ద్వారా జరుగుతున్న కొనుగోళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ మార్కెట్ యార్డుకు భారీగా పసుపు అమ్మకానికి వచ్చింది. దాదాపు 50 వేల బస్తాల పసుపును రైతులు మార్కెట్ కు తీసుకొచ్చారు. ఆన్ లైన్ లో క్వింటాల్ పసుపు ధర రూ 16వేలు ఉండగా.. బహిరంగ వేలం ద్వారా క్వింటాల్ పసుపును మూడు వేలు తగ్గించి రూ. 13వేలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆఫ్ లైన్ కొనుగోళ్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త కోణం

## - కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు ఆర్థిక బంధం

**హైదరాబాద్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

మొయినాబాద్ డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, ఈ కేసులో కేదార్ అనే వ్యక్తి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఏడాది దుబాయ్‌లో డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగా మరణించిన కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రరోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, కేదార్‌కు మధ్య భారీ ఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. ముఖ్యంగా రోహిత్, రితేష్ బ్యాంక్ ఖాతా నుంచి కేదార్‌కు రూ.25 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు పక్కా ఆధారాలు సేకరించారు. ఈ ఆర్థిక లావాదేవీల గురించి రోహిత్ రెడ్డి, రితేష్‌ని ప్రశ్నించగా ఇద్దరూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, వారు విచారణకు సహకరించడం లేదని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. మరిన్ని విషయాలు రాబట్టడానికి కస్టడీని పొడిగించాల్సిన అవసరం ఉందని పోలీసులు తమ నివేదికలో స్పష్టం చేశారు.

# హసన్ పర్తి ఎస్సీ కాలనీలో చలివేంద్రం ఏర్పాటు

**ఉమ్మడి వరంగల్ జిల్లా ఏప్రిల్ 15 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

వరంగల్ నగర పరిధిలోని 66వ డివిజన్ హసన్ పర్తి లో ని ఎస్సీ కాలనీలో బాలవికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది ఈ ప్రోగ్రాం దాతగా రుద్రారపు స్వప్న తన ఆర్థిక సహాయం తో తన భర్త కీర్తిశేషులు రుద్రారపు యుగంధర్ జ్ఞాపకార్థంగా ఈ జల దాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా బాలవికాస కో..ఆర్డినేటర్ బరిగెల రమ హాజరై ప్రారంభించారు అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో ఎండలు రోజురోజుకు పెరిగి ప్రయాణికులకు, బాట సారులకు, వారి దప్పిక తీర్చడం కోసం విధంగా ఈ చలి వేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ఈ ప్రోగ్రామ్ కు దాతగా ముందుకు వచ్చిన రుద్రారపు స్వప్నను అందరూ అభినందించారు.



# సిఎం రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు

## - అనుమానాలతో గందరగోళం సృష్టించవద్దు
## - రేవంత్ ప్రధానికి లేఖ రాయడంపై పార్టీ నేతల విమర్శలు

**హైదరాబాద్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలపడాన్ని కుట్ర కోణంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి

## - తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
## - పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయడం నా అదృష్టం
## - కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరంగా పాటుపడతా
## - చంద్రగిరి నా జీవితంలో టర్నింగ్ పాయింట్
## - మంత్రి లోకేశ్ వెల్లడి

**తిరుపతి,ఏప్రిల్ 15 (నేషనలిస్ట్ వాయిస్)**

తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనను ఎంపిక చేయటాన్ని అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కష్టపడతానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. బుధవారం చంద్రగిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన యువనేత లోకేశ్ తొలిసారిగా తమ ప్రాంతానికి రావడంతో చంద్రగిరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఆయనను ముంచెత్తారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 'ప్రత్యర్థులు బెదిరించినా భయపడకుండా తొడగొట్టి ఎన్నికల బరిలో నిలబడిన అంజిరెడ్డి తాత.. ప్రాణం పోతున్నా ప్రత్యర్థి పేరు తన నోట పలకని తోట చంద్రయ్య.. రక్తమోడుతున్నా పోలింగ్ బూతులో కూర్చున్న మంజులారెడ్డి నాకు స్ఫూర్తి. మీ అందరి త్యాగాల వల్లే 94 శాతం సీట్లతో ఈ రోజు మేమంతా ఇక్కడ కూర్చున్నాం. ప్రజలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి, ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలుం టాయని పాదయాత్రలో చెప్పా.. అదే ఇప్పుడు చేస్తున్నాం. మేం వారి మాదిరిగా రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదని అన్నారు. అభంశుభం తెలియని అమర్నాథ్ గౌడ్, అబ్దుల్ సలాం, తోట చంద్రయ్య వంటి వారిని నిర్దాక్షిణ్యంగా పొట్టనబెట్టుకున్నారు. దోషులపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటున్నాం. మూడు రోజుల క్రితం దేవాలయానికి అడ్డుగా ఉన్న కారు తీయమని చెప్పినందుకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మనుషులు భక్తులపై దాడిచేశారు. భక్తులపై దాడిచేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. అటువంటి దుశ్చర్యకు పాల్పడేవారిని వదిలిపెట్టే ప్రసక్తిలేదని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తన రాజకీయ జీవితాన్ని చంద్రగిరి నుంచే ప్రారంభించారు' అని అన్నారు. 'యువగళం పాదయాత్రలో చంద్రగిరి నాకు టర్నింగ్ పాయింట్. ఈ రోజు ఇక్కడే నా రాజకీయ పదోన్నతికి సంబంధించిన శుభవార్త విన్నాను. అందుకే చంద్రగిరి మాకు అచ్చివచ్చిన నియోజకవర్గం. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత. ఇటీవల పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున సీఎం చంద్రబాబు పక్కన సామాన్య కార్యకర్తలు కూర్చున్నారు. కార్యకర్తల కోసం సుమారు రూ.150 కోట్ల బీమా సొమ్ము వెచ్చించాం. గత ప్రభుత్వంలో కేడర్‌పై పెట్టిన తప్పుడు కేసులన్నీ ఎత్తేస్తాం. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చాలా వరకు క్లియర్ చేశాం. మిగిలినవి కూడా త్వరలో విడుదల చేస్తాం. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసే బాధ్యత మేం తీసుకుంటాం. కోటిమంది సభ్యులు గల అతిపెద్ద కుటుంబం తెలుగుదేశం అని అన్నారు. ఇంత పెద్ద కుటుంబంలో చిన్నచిన్న సమస్యలు సహజం. నమ్మిన సిద్ధాంతం కోసం కేడర్ కలసికట్టుగా కష్టపడి పనిచేయాలి. అలిగి ఇంట్లో పడుకుంటే నష్టపోయేది మనమే. అధునాతన టెక్నాలజీతో ప్రతి కార్యకర్త చేసే పనిని ట్రాక్ చేస్తున్నాం. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను 'మై టీడీపీ యాప్' ద్వారా గుర్తించి, సముచిత స్థానం కల్పిస్తాం. చంద్రగిరి చెవిలో పువ్వుగా పేరొందిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని జగనే నమ్మడం లేదు. ఆయన చేతివాటం జగన్‌కు అర్థమైంది. మద్యంలో 600 కోట్లు కొట్టేశాడు. దేవుడి లడ్డూలు, వస్త్రాలను సైతం అమ్ముకున్నాడు. అటువంటి అవినీతిపరుడి నుంచి చంద్రగిరి ప్రజలకు విముక్తి లభించింది. ఎమ్మెల్యే పులివర్తి నాని నియోజకవర్గంలో పనుల కోసం మా వెంట పడుతుంటారు. గత 22 నెలల్లో నియోజకవర్గంలో రూ.900 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. చంద్రగిరికి పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది. చిన్నచిన్న సమస్యలను పక్కనబెట్టి టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్ కలసికట్టుగా ప్రత్యర్థులపై పోరాడాలని అన్నారు.

# నేటి నుంచే స్వీయ గణన నగారా..

## ఏప్రిల్ 16 నుంచి 30వ తేదీ వరకు పక్రియ
## అందుబాటులో పోర్టల్
## కచ్చితమైన జనగణన డేటాకు వినూత్న కార్యాచరణ
## ప్రతిఒక్కరూ చైతన్యంతో భాగస్వాములు కావాలి
## ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

దేశ ప్రగతి పథానికి దిక్సూచి అయిన జన గణన - 2027లో తొలిదశలో భాగంగా ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు స్వీయ గణన జరుగుతుందని.. ఇందులో ప్రజలు కీలకభాగస్వాములై పక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ డా. జి.లక్ష్మీశ కోరారు. బుధవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో జనగణనపై జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియతో కలసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనలో తొలిసారిగా ఈ విధానం అందుబాటులోకి వచ్చిందని.. కచ్చితమైన డేటాతో పాటు కీలకమైన జనగణనలో విస్తృత ప్రజాభాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సౌకర్యాన్ని కల్పించినట్లు వివరించారు. పోర్టల్ ద్వారా ప్రజలు తమ వివరాలను పొందుపరుచుకోవచ్చని.. దీనివల్ల సమయం ఆదాతో పాటు దోష రహితంగా కచ్చితమైన డేటా లభిస్తుందని వివరించారు. ఈ విధానం వల్ల ఎన్యూమరేటర్ భౌతిక పరిశీలనకు వచ్చినప్పుడు స్వీయ గణన ద్వారా అందించిన డేటాను త్వరితగతిన ధ్రువీకరించేందుకు వీలవుతుందన్నారు. బిల్డింగ్ నంబరు, కుటుంబంలో మొత్తం సభ్యులు, ఇంటి యాజమాన్య స్థితి, తాగునీటికి ప్రధాన వనరు, ఇంటర్నెట్ సౌకర్యం, టీవీ సౌకర్యం ఇలా 34 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు



స్వీయ గణన ద్వారా స్వచ్ఛందంగా అందించవచ్చున్నారు. అదేవిధంగా 15 రోజుల అవుట్‌రీచ్ క్యాంపయిన్‌లో భాగంగా ఒక్కో రోజు ఒక్కో వర్గం లక్ష్యంగా స్వీయ గణనపై ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఏప్రిల్ 16న గౌరవ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్‌పీ, ఎంపీపీ ఛైర్‌పర్సన్లు, జెడ్‌పీటీసీ, ఎంపీటీసీలను స్వీయ గణనలో భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 17వ తేదీన సచివాలయ సిబ్బంది, హెచ్‌వోడీ కార్యాలయాల సిబ్బంది, జిల్లా కార్యాలయాల సిబ్బంది, మండల కార్యాలయాల సిబ్బంది తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇలా ఏప్రిల్ 30 వరకు వివిధ వర్గాల ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. ఈ 15 రోజుల కార్యక్రమం సజావుగా సాగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా ఇప్పటికే ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మీడియా పాత్ర కూడా కీలకమని పేర్కొన్నారు. స్వీయ గణనలో ప్రజలందరూ పాల్గొని జిల్లాను ముందువరుసలో నిలపాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

# రూ. 25 లక్షల కోట్లు నష్ట పరిహారం చెల్లించాలి

## - రెండోదఫా చర్చల వేళ ఇరాన్ డిమాండ్

**టెహ్రాన్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

అమెరికాతో రెండో సారి శాంతి చర్చలు ప్రారంభం కానున్న వేళ ఇరాన్ కీలక డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. ఇటీవల జరిగిన యుద్ధంలో తమ దేశానికి భారీ నష్టం వాటిల్లిందని పేర్కొంటూ, దాదాపు 270 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 25 లక్షల కోట్లు పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. తమకు జరిగిన నష్టాలను భర్తీ చేసేందుకు ఇతర దేశాలు సహాయపడాలని ఇరాన్ కోరుకుంటోంది. యుద్ధం కారణంగా దేశంలోని మౌలిక సదుపాయాలు, గృహాలు, రవాణా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ నష్టాన్ని దేశం ఒంటరిగా భరించడం సాధ్యం కాదని, అంతర్జాతీయ స్థాయిలో పరిహారం అవసరమని ఇరాన్ పేర్కొంది. గృహ నిర్మాణాలు, మౌలిక వసతులు ధ్వంసం అవడమే కాకుండా, చమురు, వాణిజ్య రంగాల్లో మూసివేత వల్ల నష్టాలు భారీగా ఉన్నాయని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు.

# క్యాన్సర్ వారికి చికిత్స చేయడం వల్ల పూర్తిగా నయం చేయవచ్చు

## - మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిపుణులు

## డా. కండ్ర ప్రశాంత్ రెడ్డి వెల్లడి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 15 (నేషనలిస్ట్ వాయిస్)**

క్యాన్సర్ అనగానే భయపడే పరిస్థితి ఇప్పటికీ సమాజం లో కనిపిస్తున్నప్పటికీ, ఆధునిక వైద్య సాంకేతికతల తో ఈ వ్యాధిని సమర్ధ వంతంగా నియంత్రించడం, చికిత్స చేయడం సాధ్య మవుతోందని మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిపుణులు తెలిపారు. మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కు చెందిన నిపుణులు మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ ను సందర్శించి క్యాన్సర్ పై అవగాహన కల్పించే ఉద్దేశం తో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేడియేషన్ ఆంకాలజిస్టు డా. కండ్ర ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ అనగానే భయపడే పరిస్థితి ఇప్పటికీ సమాజంలో కనిపిస్తున్నప్పటికీ, ఆధునిక వైద్య సాంకేతికతలతో ఈ వ్యాధిని సమర్ధ వంతంగా నియంత్రించడం జరుగుతుందన్నారు. ఆధునిక రేడియేషన్ పద్ధతులు అత్యంత ఖచ్చితత్వంతో పనిచేస్తూ, కేవలం క్యాన్సర్ కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటాయని, దీనివల్ల ఆరోగ్యకర కణజాలానికి నష్టం తగ్గుతుందని చెప్పారు. తద్వారా రోగులు తక్కువ దుష్ప్రభావాలతో వేగంగా కోలుకునే అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. మెడికల్ ఆంకాలజిస్టు డా. ఏ. వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స వ్యక్తిగత వైద్య విధానాల వైపు వేగంగా మారుతోందని, ప్రతి రోగి శరీర నిర్మాణం, వ్యాధి దశను బట్టి




ప్రత్యేకంగా చికిత్సను రూపొందిస్తున్నామని వివరించారు. ఈ విధానం ద్వారా చికిత్స ఫలితాలు మరింత మెరుగవు తున్నాయని అన్నారు. మల్టీ డిసిప్లినరీ విధానం ద్వారా ఆంకాలజిస్టులు, రేడియాల జిస్టులు, సర్జన్లు, ఇతర నిపుణులు కలిసి ప్రతి రోగికి సమగ్ర చికిత్సను అందిస్తున్నారని తెలిపారు. వరంగల్ వంటి నగరాల్లో కూడా అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలను అందుబాటులో కి తీసుకురావడం, ప్రజల్లో అవగాహన పెంచడం మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# అమెరికా ఆర్థిక వ్యవస్థలో వసలదారుల కీలక భూమిక

## వారు ఈదేశ ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు

## తన అత్తామామలు కూడా ఆకోవలోని వారే

## ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు

**న్యూయార్క్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

అమెరికా ఆర్థికవ్యవస్థలో వలసదారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ అన్నారు. అదే సమయంలో ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్స్‌పై కఠిన నియంత్రణ నూ సమర్థించారు. అమెరికా పౌరసత్వం పొందడం అంటే ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమేనని వాన్స్ స్పష్టంచేశారు. హెచ్–1బీ వ్యవస్థలో మోసాలు జరుగుతున్నాయని భావిస్తున్నట్లు చెప్పారు. నేను భారత్ నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాను. నాకు నా అత్తమామలంటే చాలా ఇష్టం. వారు గొప్ప వ్యక్తులు. యూఎస్‌కు వారు ఎంతో సేవ చేశారు. భారత్ నుంచి వచ్చి ఇక్కడ చదువుకొని, ఈ దేశ పౌరుడిగా మారిన మా మామగారు.. అమెరికా ప్రయోజనాల కోసమే పాటుపడ్డారని వ్యాఖ్యానించారు. భారత మూలాలున్న తన అత్తింటి కుటుంబంపై జేడీవాన్స్ ప్రశంసలు కురిపించారు. అమెరికాను సుసంపన్నం చేయడంలో, ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడంలో వారు ఒక నిదర్శనంగా నిలిచారన్నారు. జార్జియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. హెచ్–1బీ వీసాలపై అమెరికాలో నివసిస్తున్నవారు గ్రీన్‌కార్డ్ కోసం సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వస్తోందంటూ భారత సంతతి వ్యక్తి ఒకరు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా బదులిచ్చారు. ఉషా చిలుకూరి అమెరికాలో కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. ఇరాన్‌తో చర్చల అంశంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న అపనమ్మకం రాత్రికి రాత్రి పోయేది కాదని అన్నారు. ఇరాన్ ప్రతినిధులు ఒప్పందం కుదరాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లోనే ఈ సంప్రదింపులు జరగొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వాషింగ్టన్–టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఆలోపే చర్చల ద్వారా శాశ్వత శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరుపక్షాలు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది.




# వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

## - పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

## - కుతుబ్‌షాహి టూంబ్స్ తదితర కట్టడాలను పరిశీలించిన జూపల్లి

**హైదరాబాద్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

కుతుబ్ షాహీ టూంబ్స్ లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లో జరుగుతున్న పనులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాపరాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు. కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని



అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియం ను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. ÷లంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లతో పాటు బిసి బిల్లు పెట్టాలి

## ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకోం

## రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు గర్హనీయం

## కాంగ్రెస్ ఎంపి మల్లు రవి మండిపాటు

**న్యూఢిల్లీ,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

మహిళా రిజర్వేషన్‌తో పాటు బీసీలకు కూడా రిజర్వేషన్ పెట్టాలని ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎంపీ హెచ్చరించారు. పార్లమెంట్‌లో తమ గళం వినిపిస్తామన్నారు. ఇలానే జరిగితే తెలంగాణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. నియోజకవర్గాల పునర్వి భజన బిల్లు ఆమోదం పొందాలంటే టూ థర్డ్ మెజారిటీ కావాలని ఎంపీ మల్లు రవి వెల్లడించారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎంపీ తీవ్రంగా ఖండించారు. సీఎంను నోరుమూసుకుని కూర్చోమంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అహంకారపూరిత మాటలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం అంటే కిషన్ రెడ్డికి విలువ లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. భారతదేశం ఐక్యంగా ఉండాలని ఇద్దరు కాంగ్రెస్ ప్రధాన మంత్రులు ప్రాణత్యాగం చేశారని ఎంపీ గుర్తుచేశారు. భారతదేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు పైన పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రం హడావుడి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను రెండింటిని ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడం లేదని ప్రచారం చేస్తున్నారు. ఈ రెండు అంశాలు ఒకదానికి ఒకటి సంబంధం లేనివని ఎంపి మల్లు తెలిపారు. రెండింటిని విడదీసి వేరు వేరుగా చర్చించి అమలు పైన విధివిధానాలపైన పారల్మటెంట్ నిర్ణయం తీసుకోవాలన్నారు.



# మహిళా రిజర్వేషన్ బిల్లుపై అభ్యంతరం

## - కులగణన లేకుండా బిల్లు అమలు కుదరదు

## - బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమే

## - విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

మహిళా రిజర్వేషన్లపై కేంద్రం తీరును రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న సవరణ కేవలం అధికారం కోసమేనని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతు ఇస్తుందని తేల్చి చెప్పారు. గురువారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కులగణన లేకుండా మహిళా రిజర్వేషన్ల అమలులో పారదర్శకత ఉండదని అభిప్రాయపడ్డారు. చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కుట్ర జరుగుతోందన్నారు. కుల గణన డేటాను విస్మరించడం అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమేనని అన్నారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లుతో మహిళా రిజర్వేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఏప్రిల్ 16న పార్లమెంటు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ ఓ వీడియో విడుదల చేశారు. డీలిమిటేషన్‌తో కేంద్ర ప్రభుత్వం గెర్రీమాండరింగ్‌కు పాల్పడే ప్రయత్నం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నియోజకవర్గాలను తమకు అనుకూలంగా పునర్వ్యవస్థీకరించుకునే కుట్ర చేస్తోందన్నారు. గెర్రీమాండరింగ్‌తో మళ్లీ అధికారం పొందేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు.కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేష్ మాట్లాడుతూ.. 'మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. మహిళా రిజర్వేషన్లను 2023లోనే అమలు చేయమని కోరాం. మా విజ్ఞప్తిని ఏమాత్రం కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఓటమి నిర్దారణ కావడంతో, అర్ధాంతరంగా ఈ బిల్లును ప్రవేశపెట్టాలని అధికార బీజేపి భావిస్తోంది. డీ లిమిటేషన్ ద్వారా నార్త్, ఈస్ట్, సౌత్, చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది. లోక్‌సభ 543 స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలి. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తాము' అని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు మేము వ్యతిరేకం కాదు. ప్రభుత్వం తెచ్చిన విధానమే తప్పు. రాజకీయ లబ్ధి కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తెరపైకి తెచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. అస్సాం, జమ్మూ కాశ్మీర్‌లో జరిగినట్లే నియోజకవర్గాల విభజనలో అవకతవకలకు కేంద్రం యత్నిస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలులో జాప్యం చేయడానికే కేంద్రం సాకులు వెతుకుతోంది.

# ఇంటర్ ఫలితాల్లో విజయభేరీ మోగించిన మాధురి కళాశాల విద్యార్థులు

## - కళాశాల కరస్పాండెంట్ ప్రేమ్ కుమార్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 15 (నేషనలిస్ట్ వాయిస్)**

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో భీమడోలులోని మాంటిసోరి విద్యా సంస్థల్లో భాగమైన మాధురి జూనియర్ కళాశాల మరియు వోకేషనల్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విజయభేరి మోగించారని ఆ కళాశాల కరస్పాండెంట్ కె.ప్రేమ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు .

బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ విడుదల చేసిన ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన జూనియర్ ఇంటర్ విద్యార్థులు పి రోషిని తనీషా ఉత్పల ఎంపీసీలో 452 మార్కులు, బైపీసీలో ఏ. ప్రసన్న 424 మార్కులు, సీఈసీలో బి.కోమలి 417 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిసారని ప్రశంసించారు. వీరితోపాటు సీనియర్ బైపీసీలో లూర్దూ సంజన 925 మార్కులు మార్కులు సాధించారని కొనియాడారు. ఒకేషనల్ కళాశాలకు సంబంధించి మొదటి సంవత్సరం ఎం పి హెచ్ డబ్ల్యు లో జి శ్రీలక్ష్మి 465 మార్కులు, జూనియర్ ఎంఎల్ టి లో యు.నాగ దుర్గ 460 మార్కులు, సీనియర్ ఎన్ పి హెచ్ డబ్ల్యు లో ఎల్. కుసుమాంజలి 962 మార్కులు, సీనియర్ ఎం ఎల్ టి లో సిహెచ్ నవ్య 931 మార్కులతో అత్యుత్తమ ఫలితాలను సాధించారని చెప్పారు. తమ కళాశాల విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసించి మెరుగైన ఫలితాలను సాధించడం అభినందనీయమని కొనియాడారు. అంకితభావంతో కృషి చేస్తే



సాధించలేనిదేదీ లేదని తమ కళాశాల విద్యార్థులు నిరూపించారని, అందుకు నిదర్శనమే తమ విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలన్నారు. నిరంతర పర్యవేక్షణ అధ్యాపకుల అత్యుత్తమ బోధనే ఈ విజయానికి కారణమని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించి, సంస్థ ఖ్యాతిని ఇనుమడింపజేసిన సరస్వతీ పుత్రులు, ఆణిముత్యాలను కరస్పాండెంట్ ప్రేమ్ కుమార్ పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఇంతటి విజయానికి కారణమైన అధ్యాపకుల సేవలను కొనియాడారు. తమ కళాశాలలో విద్యనభ్యసించిన ప్రతి విద్యార్థి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నదే తమ సంస్థ లక్ష్యమని వివరించారు.

# పునర్విభజన జనాభా ప్రకారమే

## - రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే
## - సిఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు
## - బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**వరంగల్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రాంచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన ప్రక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.




# మోడీ మహిళలకు అతిపెద్ద కానుక

## - మహిళా బిల్లుతో వారికి పెద్దపీట
## - వరంగల్ నారీ శక్తి వందన్ అధినియంలో రామచంద్రరావు






**వరంగల్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

ప్రధాని మోడీ సుపరిపాలనలో వరంగల్ లో మునుపెన్నడూ చూడని అపూర్వమైన అభివృద్ధి జరుగుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద వరంగల్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ జరుగుతోందన్నారు. 'పీఎం మిత్ర' టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కావచ్చున్నారు. ఈ ప్రాంత ప్రగతికి కేంద్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులే అందుకు నిదర్శనం అన్నారు. అలాగే మహిళా రాజకీయ సాధికారతకు బాటలు వేస్తూ మోదీ సర్కార్ తీసుకువచ్చిన చారిత్రాత్మక 'నారీ శక్తి వందన్ అధినియం' పట్ల వరంగల్ ప్రజలు అమితమైన హర్షం వ్యక్తం చేస్తున్నారు. నరేంద్ర మోదీ కి తెలంగాణ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం వరంగల్‌లోని నారీమణులతో కలిసి చారిత్రాత్మక 'నారీ శక్తి వందన్ అధినియం' విజయోత్సవాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రధాని మోడీ తీసుకున్న ఈ నిర్ణయం.. నవ భారత రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చబోతున్న ఒక సువర్ణాధ్యాయం అని అన్నారు. ఇదిలావుంటే వరంగల్‌లో ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీధి విక్రయదారులకు టీ స్టాల్స్ పంపిణీ చేయడం జరిగింది. పట్టణ ఆర్థిక వ్యవస్థలో, ప్రజలకు నిత్యావసరాలను వారి ముంగిటకే చేరువ చేయడంలో వీధి విక్రయదారుల పాత్ర అత్యంత కీలకం. వీరి కష్టాన్ని గుర్తించిన మోడీ 'పీఎం స్వనిధి' పథకం ద్వారా వారి జీవనోపాధికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. పథకం కింద వరంగల్ అత్యధిక లబ్ధి పొందడం.. పేదలు, శ్రమజీవులు మరియు చిరు వ్యాపారుల సంక్షేమం పట్ల మోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు. వరంగల్ పర్యటన నిమిత్తం వరంగల్ విచ్చేసినఅధ్యక్షుడికి బీజేపీ కార్యకర్తలు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రతి బీజేపీ కార్యకర్త హృదయంలో వరంగల్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 1984లో దేశవ్యాప్తంగా మన పార్టీ కేవలం రెండు స్థానాలు గెలుచుకున్నప్పుడు, అందులో ఒక చారిత్రాత్మక విజయం వరంగల్ గడ్డపై జంగారెడ్డి రూపంలో నమోదైందని అన్నారు. ఆనాటి ఆ చారిత్రక ఘట్టం నేటికీ తరతరాల కార్యకర్తలకు స్ఫూర్తినిస్తూనే ఉంది. తెలంగాణలో కమలవికాసానికి, పార్టీని మరింత విస్తరించాలనే మన దృఢ సంకల్పాన్ని ఇది మరింత బలపరుస్తోందని అన్నారు.

# ఏసిబికి చిక్కిన లంచగొండి ఇంజనీర్

## - 50వేలు లంచం తీసుకుంటండగా పట్టివేత

**కరీంనగర్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**



కరీంనగర్ జిల్లాలో అవినీతి మున్సిపల్ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్.. ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికాడు. జిల్లాలోని హుజూరాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నుసం సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. పట్టణంలో నిర్మించిన స్ట్రామ్ డ్రైనేజీకి సంబంధించిన ఫైనల్ బిల్లు కోసం మెజర్‌మెంట్ బుక్‌లో నమోదు చేయాలని అధికారులను సంప్రదించాడు. అయితే ఏఈ సుధాకర్‌రెడ్డి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేయగా బుధవారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈపై కేసు నమోదు చేసి ,అరెస్టు చేశామని, అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. వాటర్ డ్రెయిన్ పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కోసం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో అసిస్టెంట్ ఇంజనీర్ గా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ కు చెందిన సంతోష్ కుమార్ అనే కాంట్రాక్టర్ నుంచి రూ 50వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు సుధాకర్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు.

# మీ సేవ కేంద్రాల్లో అవినీతి

## - సర్వీస్ కోసం వచ్చే వారి నుంచి వసూళ్లు
## - ఫిర్యాదులు రావడంతో ఎసిబి సోదాలు

**హైదరాబాద్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

తెలంగాణ వ్యాప్తంగా మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఖైరతాబాద్, అంబర్ పేట్, అల్వాల్‌లో మీసేవ ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. పౌర సేవ పత్రాల జారీలో దళారుల ద్వారా మీసేవ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో బుధవారం ఏసీబీ రంగంలోకి దిగింది. సోదాల్లో భాగంగా మీసేవ సిబ్బంది ప్రజలను ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మీ సేవల్లో దోపీడి ఎక్కువైపోయిందని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. చార్జీల పేరుతో మీసేవ సిబ్బంది చేస్తోన్న దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని జనం ఆరోపిస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో కుల, ఆదాయ, నివాస, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం వెళ్తే దోచుకుంటున్నారు. టెక్నాలజీతో పౌర సేవలను మరింత సులభతరం చేస్తున్నామంటూ అన్ని సేవలను మీ సేవ కేంద్రాలకు అప్పగించి అధికారులు మాత్రం చేతులు దులుపు కుంటున్నారు. దీంతో నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, ఓబీసీ తదితర సర్టిఫికెట్ల కోసం రూ. 45 చెల్లిస్తే చాలు. కానీ, ఈ ఫీజు ఎక్కడా తీసుకోవడం లేదు. దాదాపు రూ.500 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు అప్లై చేసేప్పుడు కాకుండా తిరిగి సర్టిఫికెట్లు ప్రింట్ తీసుకునే టైంలో అదనంగా కలెక్ట్ చేస్తున్నారని దరఖాస్తుదారులు చెప్తున్నారు. క్యాస్ట్, లోకల్, ఇన్కమ్ సర్టిఫికెట్లు కావాలంటే సెల్ఫ్ డిక్లరేషన్ కోసం అఫిడవిట్ సమర్పించాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇది హైదరాబాద్ జిల్లా మినహా మిగతా జిల్లాల్లో తప్పనిసరి అనే రూలేవు. హైదరాబాద్ జిల్లాలో కూడా ఇదివరకు క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకొని ఉంటే ఆ సర్టిఫికెట్ ఆధారంగా మళ్లీ అప్లై చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. కానీ, మీ సేవలో మాత్రం అదేమీ కుదరదని, అఫిడవిట్ కచ్చితంగా కావాల్సిందేనని వందల్లో వసూళ్లు చేస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో తప్పనిసరిగా సర్వీసులకు సంబంధించిన ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ చాలా చోట్ల స్పష్టమైన సమాచారంతో చార్ట్ ఏర్పాటు చేయడంలేదు. ఒకవేళ చార్ట్ పెట్టినా ఆ ధరలు కనిపించకుండా చిన్న అక్షరాలతో మొక్కుబడిగా ఏర్పాటు చేస్తున్నారు. మీసేవ నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని మీ సేవకు సంబంధించిన ఉన్నతాధికారులు చెప్తున్నారు. సెంటర్లలో ఖచ్చితంగా సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలని, అందులో చెప్పిన ధరలనే తీసుకోవాలం టున్నారు. ఎక్కడైనా ఎక్కువ డబ్బులు తీసుకున్నట్లు దృష్టికి వస్తే డయల్ 1100 లేదా 18004251110 నంబర్కు కాల్ చేసి సమాచారం ఇస్తే యాక్షన్ తీసుకుంటామంటున్నారు అధికారులు.

# పాటలు తప్ప స్కామ్‌లు తెలియవు మీడియా ముందు మంగ్లీ ఆవేదన

**హైదరాబాద్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**

తనపై వస్తున్న ఆరోపణల కారణంగా చాలా నగిలిపోతున్నానని, తనకు పాటలు తప్ప.. స్కామ్‌లు తెలియవని సింగర్ మంగ్లీ అన్నారు. విచారణ చేసుకోవాలని.. తాను తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా రెడీగా ఉన్నానని చెప్పారు. బుధవారం మంగ్లీ మీడియాతో మాట్లాడుతూ.. 'పేదరికం నుంచి వచ్చాను. డబ్బు విలువ నాకు తెలుసు. నెల రోజులుగా నా ప్రోగ్రామ్‌లు, రికార్డింగ్స్ వదులుకున్నా. ప్రజల్లోకి తప్పుగా వెళ్తోంది. బాధితులకు నేను అండగా ఉంటా. మధు నాయక్, హిమాకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావుపై డీజీపీకి ఫిర్యాదు చేశాను' అని అన్నారు. మంగ్లీ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. 'నేరగాళ్లే బాధితుల రూపంలో పోలీస్ స్టేషన్‌కి వస్తున్నారు. అసలు స్కామ్ చేసిన వాళ్లే మీడియా ముందుకు వచ్చి బాధితులుగా మాట్లాడుతున్నారు. సుభాక్షేత్ర బిజినెస్ అనే పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి.. దానికి ఎండీగా ఉన్నది మధు. ప్రస్తుతం బాధితుడిగా మీడియాతో మాట్లాడుతున్న హిమాకాంత్ రెడ్డి ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నాడు.

# తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా గొర్రెల శ్రీధర్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 15 (నేషనలిస్ట్ వాయిస్)**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర కమిటీలను బుధవారం ప్రకటించారు. దీనిలోభాగంగా తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా తాడేపల్లిగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, తెదేపా సీనియర్ నాయకులు గొర్రెల శ్రీధర్ ను నియమించారు. ఈ సందర్భంగా గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అవకాశం కల్పించిన తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ కు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వివరించారు.



కల్పించిన తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన నారాయణ విద్యార్థులు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 15 (నేషనలిస్ట్ వాయిస్)**

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో తాడేపల్లిగూడెం పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని ఆ విద్యా సంస్థల రీజనల్ ఇంచార్జ్ బండారు సురేష్ తెలిపారు. పట్టణంలోని స్థానిక విద్యాసంస్థలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. నారాయణ విద్యాసంస్థలు డిస్క్రిప్టివ్, కాంపిటేటివ్ విభాగాల్లో విద్యా బోధన చేస్తుందని తెలిపారు. తమ విద్యా సంస్థ కాంపిటేటివ్ తో పాటు డిస్క్రిప్టివ్ పై కూడా దృష్టి సారించిందన్నారు. జూనియర్ ఎంపీసీలో షణ్ముఖ 470 మార్కులకు గాను 461 మార్కులు, బైపీసీలో సాహిని 455 మార్కులకు గాను 449 మార్కులు, సీనియర్ ఎంపీసీలో అమూల్య 984 మార్కులు సాధించి తమ సంస్థ పేరు ప్రఖ్యాతలను నిలబెట్టారని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో బాలికలు సత్తా చాటి ఆణిముత్యాలుగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగబాబు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



# జనాభా ప్రకారం ఆలోచిస్తే నష్టమే

## అందుకే రాష్ట్రాల్లో 50 శాతం పెంపు

### బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి

**హైదరాబాద్,ఏప్రిల్15 (నేషనలిస్ట్ వాయిస్)**



జనాభా ప్రకారమైతే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే అన్ని రాష్ట్రాల్లో 50 శాతం పెంపు విధానం తెచ్చారని తెలంగాణ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై ఆయన మీడియాతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వమే చట్టాలు చేసిందన్నారు. 1972 లో కాంగ్రెస్ చేసిన డీలిమిటేషన్ వల్ల ఏపీకి ఒక లోక్‌సభ సీటు తగ్గింది. ప్రస్తుత సీట్ల ప్రకారమైతే మహిళలకు 170 సీట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. సీట్లు పెంచి మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే 270కిపైగా సీట్లు వస్తాయి. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా హైబ్రిడ్ పాలసీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారని విమర్శించారు.డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని తెలిపారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ విమర్శలు చేస్తున్నారని అన్నారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు.జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది ఎక్కడ ఉందో చెప్పాలని అన్నారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని తెలియదా అని అన్నారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాల తీరుపై మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారని ఇది సరికాదని అన్నారు.

# బాల సదనం బాలికలు బాగా చదువుకోవాలి

- బాల సదనం లోని బాలికలు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- హనుమకొండ సుబేదారి లోని బాలికల బాలసదనం ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 15 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

బాలికల భవిష్యత్తు బలంగా ఉండాలంటే విద్యే ప్రధాన ఆధారం అని, బాల సదనంలో ఉన్న ప్రతి విద్యార్థిని మంచి లక్ష్యాలతో కృషి చేస్తూ బాగా చదువుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. బుధవారం హనుమకొండ సుబేదారి లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల బాల సదనాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా అక్కడ నివసిస్తూ వివిధ విద్యా సంస్థల్లో చదువుతున్న బాలికలతో ఆత్మీయంగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతి, ఆహారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. బాల సదనంలో ఉన్న విద్యార్థినుల సంఖ్య, వారు అభ్యసిస్తున్న కోర్సులు, వంటశాల నిర్వహణ, ఆహార నాణ్యతపై విద్యార్థినులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి, భోజన నాణ్యతను పరీక్షించారు.

వేసవి సెలవుల్లో బాలికల హాజరు, దత్తత ప్రక్రియలపై జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, సూపరింటెండెంట్ కళ్యాణి నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల సదనం లోని బాలికల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారికి ఉత్తమ సంరక్షణ, విద్యా అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. దత్తతకు సంబంధించిన దరఖాస్తులు వచ్చిన పక్షంలో, బాలికల గార్డియన్ సమ్మతితో పారదర్శకంగా, వేగవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని ప్రోత్సహించారు.

ఇద్దరు విద్యార్థినులు జనరల్ నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వివరించగా, కలెక్టర్ వారికి అభినందించారు.

**పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్**

సందర్శన సమయంలో లక్ష్మీ ప్రసన్న అనే బాలికకు పుట్టిన రోజు కావడంతో, జిల్లా కలెక్టర్ ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. స్వయంగా దగ్గరకు తీసుకుని ఆశీర్వదించడం ద్వారా బాలిక లో ఆనందం నింపారు. అనంతరం బాలికల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చూసి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే బాల సదనానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం. కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, కౌన్సిలర్లు త్రివేణి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలి

## - హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 15 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

ఉపాధి హామీ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన ఉపాధి హామీ పనుల ప్రగతిపై డిఆర్డిఏ అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పన, పనుల పురోగతి, లక్ష్య సాధనపై సమగ్రంగా చర్చించారు.

సమావేశంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ, జిల్లాకు మూడు లక్షల అరవై ఐదు వేల పని దినాల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు సుమారు డెబ్బై వేల పని దినాలు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేసే విధంగా పనులను వేగవంతం చేయాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనులను ఉదయం 5 గంటల నుంచి 11 గంటల మధ్య నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూలీలకు సౌకర్యవంతమైన వాతావరణంలో పనులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల్లో అధిక సంఖ్యలో కూలీలను భాగస్వామ్యం చేసినందుకు ఎర్రబెల్లి గ్రామానికి చెందిన సీనియర్ మేట్ ను కలెక్టర్ శాలువాతో సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, డిఆర్డిఏ ఏవో శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలి


## - హెల్మెట్లు పంపిణీ చేసిన సర్పంచ్ రాకేష్ రెడ్డి

**ఉమ్మడి వరంగల్ జిల్లా ఏప్రిల్ 15 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం గంటూరు పల్లి గ్రామ పంచాయతీ గ్రామ సభలో గ్రామ సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో గంటూరు పల్లి గ్రామస్తులు మోటారు వాహనాలు కలిగిన వారు అందరూ తప్పకుండా హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయాలని తీర్మానం చేయడం జరిగింది. ఇట్టి తీర్మానంకు అనుగుణంగా కాజీపేట ఎ సి పి. పింగిలి ప్రశాంత్ రెడ్డి 100 హెల్మెట్లు గ్రామ ప్రజలకు పంచడం జరిగింది. ఈ హెల్మెట్లు గ్రామ సర్పంచ్ సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి సి ఐ చేరాలు, ఎస్సై దేవేందర్, ఉప సర్పంచ్, పంచాయతీ రాజ్ ఏ ఈ, గ్రామ కార్యదర్శి, ఇతర నాయకులు పాల్గొన్నారు.







# బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ తొలి రోజు ఆటలో మెరిసిన విశేష్ శర్మ



హైదరాబాద్‌కు చెందిన 19 ఏళ్ల విశేష్ శర్మ, బౌల్డర్ హిల్స్ గోల్ఫ్, కంట్రీ క్లబ్‌లో జరుగుతున్న 1 కోటి రూపాయల ప్రైజ్ మనీ బౌల్డర్స్ క్లాసిక్ టోర్నమెంట్ మొదటిరోజు తొలి రౌండ్‌లో సెవెన్-అండర్ 65 స్కోర్ నమోదు చేసి ఒక షాట్ ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచాడు. శర్మ నమోదు చేసిన 65 స్కోర్ కోర్సు రికార్డుగా నిలిచింది. ఆ రౌండ్‌లో పార్-5 14వ హోల్‌లో ఈగిల్, ఆరు బర్డీలు, ఒక బోగీ ఉన్నాయి. రెండుసార్లు డీపీ వరల్డ్ టూర్ విజేత అయిన శుభంకర్ శర్మ సిక్స్-అండర్ 66 స్కోర్ నమోదు చేసి, ఢిల్లీకి చెందిన వినయ్ కుమార్ యాదవ్‌తో కలిసి రెండవ స్థానంలో ఉన్నాడు. 2021 డిసెంబర్‌లో జంషెడ్‌పూర్‌లో జరిగిన టూర్ చాంపియన్‌షిప్ తర్వాత ఇది టూర్‌లో శుభంకర్ సాధించిన తొలి ప్రారంభం. గత సంవత్సరం వృత్తిపరంగా గోల్ఫ్ ఆడడం ప్రారంభించి, 2025లో డీపీ వరల్డ్ పీజీటీఐ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో 44వ స్థానంలో నిలిచిన యువ గోల్ఫర్ విశేష్ శర్మ, తాను నిత్యం ఆడే మైదానంపై తనకున్న అనుభవాన్ని సద్వినియోగం చేసుకుని అద్భుతమైన రౌండ్‌ను ప్రదర్శించాడు. విశేష్ మాట్లాడుతూ, "ప్రారంభంలో నేను ఆట సజావుగా ఆడాను. మంచి స్థితిలో ఉండడం పై దృష్టి సారించాను. 14వ హోల్‌లో ఈగిల్ నాకు మంచి ఊపును అందించింది. అక్కడ హైబ్రిడ్‌తో దాదాపు 10 అడుగుల దూరంలో బంతి ఆపి పట్ట్ చేశాను, అది నన్ను ముందుకు నడిపించింది" అని చెప్పాడు. ఆ ఊపును నిలుపుకుంటూ, 10 నుండి 15 అడుగుల దూరం నుండి పలు పట్ట్‌లను సమర్థంగా మార్చాడు. "నేను కల్పించుకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి పట్ట్‌లు మార్చగలిగాను" అని ఆయన చెప్పారు . తన స్వస్థలమైన హైదరాబాద్‌లో ఆడుతున్నందు వల్ల కూడా శర్మ ఆత్మవిశ్వాసంతో రాణించాడు. "హైదరాబాద్‌లో ఆడటం, ఈ టోర్నమెంట్ సమయంలో ఇంట్లో ఉండటం చాలా ఆనందంగా ఉంది. ఇక్కడి పరిస్థితుల పట్ల అవగాహన ఉండటం ఖచ్చితంగా సహాయపడుతుంది" అని ఆయన వ్యాఖ్యానించాడు. శుభంకర్ రౌండ్‌లో పార్-5 ఏడవ హోల్‌లో ఈగిల్, ఆరు బర్డీలు,రెండు బోగీలు ఉన్నాయి. "కోర్సు అద్భుతంగా ఉంది, వారం గడిచే కొద్దీ, ముఖ్యంగా గాలి .. పిన్ స్థానాల కారణంగా మరింత కష్టంగా మారుతుంది" అని శుభంకర్ పేర్కొన్నాడు. "రౌండ్ మధ్యలో నేను మంచి పట్ట్‌లు మార్చాను, ఈగిల్ కూడా నమోదైంది, అది తేడా చేసింది." "నేను చక్కగా ముగించాను, అది తర్వాతి రౌండ్‌లో ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుంది" అని ఆయన అన్నాడు. ముప్పై సంవత్సరాల వినయ్ కుమార్ యాదవ్ ఒక్క తప్పిదం లేకుండా సిక్స్-అండర్ 66 స్కోర్ నమోదు చేసి శుభంకర్‌తో సమానంగా రెండవ స్థానంలో నిలిచాడు. గత నెల గురుగ్రామ్‌లోని గోల్డెన్ గ్రీన్స్ గోల్ఫ్ ఢ కంట్రీ క్లబ్‌లో జరిగిన డీపీ వరల్డ్ పీజీటీఐ నెక్స్‌జెన్ ఈవెంట్‌లో ప్లే-ఆఫ్ విజయంతో వినయ్ అద్భుతమైన ఫామ్ లో ఉన్నాడు. టోర్నమెంట్ కు ముందు ముఖ్యమైన పోటీదారుల్లో ఒకరైన యువరాజ్ సంధు మొదటి రోజు 73 స్కోర్‌తో 55వ స్థానంలో ఉన్నాడు. భారతదేశంలో వృత్తిపర గోల్ఫ్ అభివృద్ధికి చేస్తున్న సహకారానికి పీజీటీఐ తన అంబ్రెల్లా పార్ట్‌నర్ డీపీ వరల్డ్‌కు, అలాగే టూర్ పార్ట్‌నర్స్ యాక్సిస్ బ్యాంక్, అమూల్, కంపా, కల్యాణి, అమృతాంజన్ ఎనర్‌లైట్, గోల్ఫ్ ప్లస్ మంత్లీ,గోల్ఫ్ డిజైన్ ఇండియాకు ధన్యవాదాలు తెలుపుతోంది. ఈ టోర్నమెంట్‌కు వేదిక భాగస్వాములుగా బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ ఢ కంట్రీ క్లబ్ ,టీ గోల్ఫ్ ఫౌండేషన్, అసోసియేట్ పార్ట్‌నర్ కాసగ్రాండ్, హాస్పిటాలిటీ పార్ట్‌నర్లు నోవోటెల్ ,హెచ్‌ఐసీసీ, ఆహార ఢ పానీయాల భాగస్వాములు ఫ్యూజన్ 9 ఆర్టిస్ట్రీ వ్యవహరిస్తున్నాయి.



# సన్ రైజర్స్ జట్టులోకి దిల్షాన్ మధుశంక

ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత విజయంతో దూసుకుపోతున్న సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాజస్థాన్ రాయల్స్‌పై స్టన్నింగ్ విజయం సాధించిన మరుసటి రోజే ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ ఈ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే అతను ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. ఈ క్రమంలో అతని స్థానాన్ని భర్తీ చేయడానికి శ్రీలంకకు చెందిన ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మధుశంకను ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఎంపిక చేసింది. ఈ మేరకు ఐపీఎల్ మేనేజ్మెంట్ అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. శ్రీలంక తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న మధుశంకకు స్వింగ్ బౌలింగ్‌లో మంచి పట్టు ఉంది. ఇప్పటివరకు అతను శ్రీలంక తరపున ఒక టెస్ట్, 28 వన్డేలు, 19 టీ20 మ్యాచ్‌లు ఆడి మొత్తం 70 వికెట్లు పడగొట్టాడు. గతంలో ముంబై ఇండియన్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నప్పటికీ, గాయం వల్ల ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం లభించలేదు. ఇప్పుడు రూ. 75 లక్షల ఒప్పందంతో సన్ రైజర్స్ గూటికి చేరుతున్నాడు. పవర్ ప్లే ఓవర్లలో బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టడం ఇతని ప్రత్యేకత. ఇతని రాకతో ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ విభాగం మరింత బలోపేతం కానుంది. ప్రస్తుతం సన్ రైజర్స్ బౌలింగ్ యూనిట్ చాలా పటిష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే యువ సంచలనాలు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ తమ అరంగేట్రం మ్యాచ్‌లోనే చెరో నాలుగు వికెట్లు తీసి అందరినీ ఆశ్చర్యపరిచారు. వీరికి తోడుగా హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్ వంటి అనుభవజ్ఞులు కూడా ఉన్నారు. జట్టు రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఏప్రిల్ 17న టీమ్‌తో చేరే అవకాశం ఉంది. అప్పటివరకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో జట్టు ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించి, పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది.రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో హైదరాబాద్ అదిరిపోయే పర్ఫార్మెన్స్ ఇచ్చింది. 217 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో ప్రఫుల్, సాకిబ్ తమ అద్భుత బౌలింగ్‌తో రాజస్థాన్‌ను 159 పరుగులకే కట్టడి చేశారు. ఈ 57 పరుగుల భారీ విజయంతో టీమ్ ఫుల్ జోష్‌లో ఉంది. ఇప్పుడు అదే ఉత్సాహంతో శనివారం తమ హోమ్ గ్రౌండ్ అయిన రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తో తలపడనుంది. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌లో మధుశంక అరంగేట్రం చేస్తాడేమో చూడాలి. ఉప్పల్ స్టేడియం వేదికగా జరగనున్న ఈ పోరు కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.




# రుతురాజ్ ఉరుకులాట తగ్గించాలి రవీచంద్రన్ అశ్విన్ కీలక సలహా

ఐపీఎల్ 2026 సీజన్‌లో పేలవ బ్యాటింగ్‌తో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రవీచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. బ్యాటింగ్‌లో దూకుడు తగ్గించి, క్రీజులో సెట్ అయ్యేందుకు టైమ్ తీసుకోవాలన్నాడు. బంతిని గాల్లోకి లేపకుండా.. సంజూ శాంసన్, ఆయుష్ మాత్రే తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలని సూచించాడు. మరోవైపు వరుస పరాజయాలతో సతమతమవుతున్న కేకేఆర్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు కావాలని అభిప్రాయపడ్డాడు. మంగళవారం చెన్నై వేదికగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 32 పరుగుల భారీ తేడాతో కేకేఆర్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ గురించి జియో హాట్‌స్టార్‌లో మాట్లాడిన అశ్విన్.. సీఎస్‌కే వరుస విజయాలు సాధిస్తున్నా.. రుతురాజ్ గైక్వాడ్ బ్యాటర్‌గా సత్తా చాటాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు.'వరుసగా రెండు విజయాలు కెప్టెన్‌గా రుతురాజ్‌కు పెద్ద ఊరటనిస్తుంది. కానీ అతను బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. అతను తిరిగి ఫామ్ అందుకోవాలంటే బ్యాటింగ్‌లో సాంకేతిక లోపాలను సరిచేసుకోవాలి. టీ20 అంటేనే దూకుడుగా ఆడటం అయినప్పటికీ.. రుతురాజ్ బౌలర్ లైన్ దాటి మరీ ముందుకు వచ్చి త్వరగా వికెట్ పారేసుకుంటున్నాడు. ఆయుష్ మాత్రే, సంజూ శాంసన్ తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలి. ఇన్నింగ్స్ ప్రారంభంలో కాస్త నిదానంగా వ్యవహరించి, బంతిని సరిగ్గా టైమింగ్ చేస్తూ ఎక్కువ సేపు క్రీజులో ఉంటే రుతురాజ్ తన ఫామ్‌ను తిరిగి పొందుతాడు. రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో నేనున్నా ఆందోళన చెందను. కెప్టెన్‌గా సాధించిన విజయాలు అతనిపై ఒత్తిడిని తగ్గిస్తాయి.'అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మరోవైపు వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు రావాలని అశ్విన్ తెలిపాడు. గతంలోనూ కేకేఆర్ ఇలాంటి పరిస్థితుల నుంచి పుంజుకొని విజేతగా నిలిచిందని గుర్తు చేశాడు. 'ప్రస్తుతం కేకేఆర్ జట్టుకు కొత్త శక్తి అవసరం. కేవలం పతిరానా వంటి స్టార్లపైనే ఆధారపడకుండా, డగౌట్‌లో ఉన్న కొత్త ప్రతిభను వెలికితీయాలి. కేకేఆర్ వద్ద తేజస్వి దహియా, ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ సౌరభ్ దూబే వంటి ప్రతిభావంతులు ఉన్నారు. వారికి అవకాశం ఇస్తే జట్టు రూపురేఖలు మారుతాయి. ఐపీఎల్ 2021లో వెంకటేష్ అయ్యర్ జట్టులోకి వచ్చి ఎలాగైతే ఊపు తెచ్చాడో.. ఇప్పుడు కూడా అలాంటి ఒక 'ఎక్స్-ఫాక్టర్' ఆటగాడు కేకేఆర్‌కు అవసరం.'అని అశ్విన్ స్పష్టం చేశాడు.



# అజింక్యా రహానేకు భారీ జరిమానా..

ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఏదీ కలిసి రావడం లేదు. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో కేకేఆర్ గెలుపు బోణీ కొట్టలేదు. మంగళవారం చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 32 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ సీజన్‌లో కేకేఆర్‌కు ఇది నాలుగో ఓటమి కాగా.. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. అయితే తాజాగా కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానేకు ఐపీఎల్ నిర్వాహకులు షాకిచ్చారు. రూ. 12 లక్షలు జరిమానాగా విధించారు. సీఎస్‌కేతో మ్యాచ్‌లో కేకేఆర్ జట్టు స్లో ఓవర్ రేటు నమోదు చేయడమే అందుకు కారణం. ఈ సీజన్‌లో కేకేఆర్ స్లో ఓవర్ రేటును నమోదు చేయడం ఇదే తొలిసారి కావడంతో కెప్టెన్ రహానే ఒక్కడికే జరిమానా విధించారు. రెండో సారి ఇదే తప్పిదానికి పాల్పడితే అప్పుడు కెప్టెన్‌కు రూ. 24 లక్షల జరిమానాతో పాటు ఇంపాక్ట్ ప్లేయర్ సహా తుది జట్టులోని ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజుల్లో 25 శాతం లేదంటే 6 లక్షలు.. రెండింటిలో ఏదీ తక్కువ అయితే అది జరిమానాగా విధిస్తారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని కనీస ఓవర్-రేట్ ఉల్లంఘనలకు సంబంధించిన ఆర్టికల్ 2.22 ప్రకారం ఈ సీజన్‌లో కేకేఆర్ టీమ్ చేసిన మొదటి ఉల్లంఘన ఇది కావడంతో.. రహానెకు 12 లక్షల రూపాయల జరిమానా విధించారని ఐపీఎల్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై సంజూ శాంసన్ (48), డెవాల్డ్ బ్రెవిస్ (41), ఆయుష్ మాత్రే (38) రాణించడంతో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. కేకేఆర్ బౌలర్లలో కార్తిక్ త్యాగి 2, వైభవ్ అరోరా, అనుకుల్ రాయ్, సునీల్ నరైన్‌లు తలా ఓ వికెట్ తీశారు. అనంతరం 193 పరుగుల లక్ష్య ఛేదనలో కేకేఆర్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 160 పరుగులకే పరిమితమైంది.






# ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి భారీతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి

రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నేసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# సర్ మరో అవకాశం ఇవ్వండి

## బుచ్చిబాబు పోస్ట్.. వైరల్

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ పెద్దితో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా రామ్‌చరణ్ 'ఎస్క్వైర్ ఇండియా' కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోల్లో చరణ్ స్టైలిష్ లుక్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. దీనికి దర్శకుడు బుచ్చిబాబు చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'సర్.. మరో అవకాశం ఇవ్వండి' అని సరదాగా కామెంట్ చేశారు. ఈ చిన్న కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీంతో 'పెద్ది' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని వార్తలు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ సినిమా తీయమంటూ అభిమానులు కూడా రిప్లైలు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ పెద్దిపై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమాలోని పాటలు ఆదరణను సొంతం చేసుకోవడంతో దీనిపై అంచ నాలు నెలకొన్నాయి.









# వారణాసి కోసం దేవర సెట్స్ ?

సూపర్‌స్టార్ మహేష్ బాబు మరియు దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న 'వారణాసి' సినిమాపై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం వారణాసి టీమ్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' సినిమా కోసం వాడిన టెక్నికల్ బ్యాక్‌డ్రాప్‌ను ప్రత్యేకంగా అండర్ వాటర్/వాటర్ సెట్స్ వినియోగించబోతున్నట్లు తెలుస్తుంది. 'దేవర' సినిమాలోని సముద్రపు సన్నివేశాల కోసం హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద భారీ వాటర్ ట్యాంక్ సెట్‌ను, బ్లూ మ్యాట్ టెక్నాలజీతో రూపొందించారు. ఇప్పుడు అదే సెట్‌ను 'వారణాసి'లో గంగా నది నేపథ్యంలో వచ్చే కీలక సన్నివేశాల కోసం రీ-డిజైన్ చేసి వాడుతున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ షెడ్యూల్ విదేశాల్లో జరగాల్సి ఉంది. కానీ ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ ప్రయాణాలు రిస్క్ అని భావించిన రాజమౌళి, తెలివిగా ప్లాన్ మార్చి హైదరాబాద్‌లోనే షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ సెట్‌లో మహేష్ బాబుపై భారీ రివర్ ఛేజ్ మరియు కొన్ని హై-టెక్ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. 'దేవర'లో వాడిన అడ్వాన్స్‌డ్ సినిమాటోగ్రఫీ టెక్నిక్స్ మరియు వాటర్ షూట్ ఎక్స్‌పర్టీస్‌ను ఈ షెడ్యూల్ కోసం ఉపయోగిస్తున్నట్లు సమాచారం.




# టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు నటుడు యశ్ ఆసక్తికర విషయం వెల్లడి

భిన్న నేపథ్యాలున్న కథలతో పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు యశ్. ప్రస్తుతం నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లోనటిస్తున్నారు. దీనితో పాటు.. గీతూ మోహన్ దాస్ డైరెక్షన్‌లో 'టాక్సిక్' చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ రెండు సినిమాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'టాక్సిక్' టీజర్ చూసి అందరూ ఇది గ్యాంగ్‌స్టర్ సినిమా అనుకుంటున్నారని కానీ, ఇది అలాంటి చిత్రం కాదని స్పష్టం చేశారు. జూన్ 4న విడుదల కానున్న 'టాక్సిక్' గురించి యశ్ మాట్లాడుతూ.. 'టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ సినిమా కాదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతోంది. భిన్నమైన ప్రపంచం.. కొత్త కథాంశంతో రానుంది. ఆకట్టుకునే విజువల్స్ ఉన్నాయి. మొదటిసారి ఒక సినిమాను ఇంగ్లీష్‌లో కూడా తెరకెక్కిస్తున్నారు. టీమ్ అంతా ఎంతో ఉత్సాహంగా పని చేస్తోంది. నా అభిమానులు నా నుంచి ఏం ఆశిస్తున్నారో నాకు తెలుసు. అందుకే ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కచ్చితంగా ఇది మిమ్మల్ని అలరిస్తుంది. దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌తో పనిచేయడం చాలా గొప్ప అనుభవం. సినిమాపై స్పష్టమైన విజన్‌తో ఉన్నారు. యాక్షన్ మాత్రమే కాకుండా, బలమైన భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో ఉంటాయని చెప్పారు. ఇక 'రామాయణ' మొదటి భాగం గురించి యశ్ పంచుకున్నారు. 'రణ్‌బీర్ అద్భుతమైన నటుడు. సినిమా విషయంలో మా ఇద్దరి విజన్, ఆలోచనలు ఒకేలా ఉన్నాయి. అది ఈ ప్రాజెక్ట్‌కి చాలా కలిసొచ్చింది. రామాయణ పార్ట్ 1లో మా ఇద్దరి కాంబినేషన్‌లో సీన్స్ లేవు' అని తెలిపారు. రణ్‌బీర్ రాముడిగా కనిపించనున్న ఈ 'రామాయణ'లో యశ్ రావణుడిగా నటిస్తున్నారు. దీపావళికి ఈ చిత్రం విడుదల కానుంది.



# నన్ను నమ్మి..నడిపించిన నా దేవతభార్య రహస్య గోరఖ్‌పై కిరణ్ ప్రశంసలు

యువ హీరో కిరణ్ అబ్బవరం ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆయన సమర్పణలో రూపొందిన 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ద్వారా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సుమారు 25 మందికి పైగా కొత్త నటీనటులను, దర్శకుడు వి. మునిరాజ్‌ని పరిశ్రమకు పరిచయం చేస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ ఎంతో భావోద్వేగభరితంగా సాగింది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం చేసిన ప్రసంగం అందరినీ కదిలించింది. 'ఈ సినిమా కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. పల్లెల నుంచి పెద్ద కలలతో వచ్చిన సుమారు 50 మంది టెక్నీషియన్లు, నటీనటుల జీవిత స్వప్నం' అని ఆయన తెలిపారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు ఎవరినీ సహాయం కోరలేదని చెప్పిన కిరణ్, ఈసారి మాత్రం కొత్తవారి కష్టానికి గుర్తింపు రావాలనే ఉద్దేశంతో పరిశ్రమ పెద్దలు, విమర్శకులు ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఈ వేడుకలో ఆయన తన భార్య, నటి రహస్య గోరఖ్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. తాను హీరో కాకముందు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ, ఆ సమయంలో రహస్య తనకు అండగా నిలిచిందని చెప్పారు. అవకాశాల కోసం తిరిగిన రోజుల్లో కూడా ఆమె నన్ను నమ్మింది. తినడానికి కూడా కష్టమైన సమయంలో ఇంటి నుండి భోజనం తీసుకువచ్చి నన్ను ఆదుకుంది. నేను హీరో అవుతానని విశ్వసించి నా చేయి పట్టుకుంది అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్న సినిమా అయినప్పటికీ టెక్నికల్ పరంగా ఎక్కడా రాజీ పడలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ చిత్ర బృందం కష్టానికి గుర్తింపుగా, వారి కుటుంబ సభ్యుల కోసం భారతదేశంలోనే అతిపెద్ద స్క్రీన్‌పై స్పెషల్ ప్రీమియర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం విశేషం.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656